http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 9 సెప్టెంబర్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?




- శాసనసభ నిబంధనలను ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా
- ఏజీని ప్రశ్నించిన హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలపై పిటిషన్ వేసిన ప్రభుత్వం
- వాదనలు వినిపించిన ఏజీ
- ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారన్న ఏజీ

హైదరాబాద్

అసెంబ్లీ బయట జరిగిన పరిణామాలపై హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. మహిళా ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలంటూ డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్ - మిగతా3లో



## నా వడోదరా అద్భుతం

- ప్రధాని మోదీ భావోద్వేగం
- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- అలకపాన్పు ఎక్కిన మేనమామకు ఇప్పుడు పని దొరికింది
- విపక్షాలపై మోదీ సెటైర్లు
- వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా ప్రాజెక్టులకు శ్రీకారం
- 2,800 కి.మీ. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తి
- 250కుపైగా ట్రక్కుల సరుకును ఒకే రైలులో తరలించిన ఘనత
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు

## రెండోరోజూ అదే 'వే'ఢీ'

- ఢీ అంటే ఢీ అన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్
- అటు అసెంబ్లీలో, ఇటు బయట పోటాపోటీ వ్యూహాలు
- రాజకీయ ఆధిపత్యం కోసం రెండు పార్టీల ప్రయత్నాలు
- రాష్ట్ర మంత్రులు, అసెంబ్లీ కార్యదర్శితో పలుమార్లు భేటీ అయిన ముఖ్యమంత్రి
- తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యల విషయంలో మంత్రాంగం.. సస్పెన్షన్ తీర్మానంపై చర్చ
- అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం



హైదరాబాద్

అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ఢీ అంటే ఢీ రెండోరోజూ కొనసాగింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటిరోజు సోమవారం బీఆర్ఎస్ నేతలు నల్ల టీ షర్టులు ధరించి రావడం, వారు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, 'అనుచిత వ్యాఖ్యల వ్యవహారంతో'పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తెలిసిందే. కాగా మంగళవారం కూడా అదే వాతావరణంలో ఉభయ సభలు జరిగాయి. ఈ అంశంపై రాజకీయ ఆధిపత్యం సాధించేందుకు రెండు పార్టీలు పోటీలు పడి వ్యూహాలు రచించాయి. ఇక అసెంబ్లీ బయట కూడా ఇదే తీరు కొనసాగించాయి. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావుల మధ్య మాటల యుద్ధం - మిగతా3లో

## వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..



- లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21
- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం
- 10 లక్షల జనాభా నగరాల కేటగిరీలో ఢిల్లీకి 21వ ర్యాంక్
- విశాఖతో కలిసి 21వ ర్యాంక్ పంచుకున్న దేశ రాజధాని నగరం
- గాలి నాణ్యతతో కాకుండా కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ఈ ర్యాంకులు
- హైదరాబాద్‌కు 19వ స్థానం, ముంబైకి 28వ ర్యాంక్

## బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ



- ద్వైపాక్షిక వాణిజ్యం, రక్షణ, ఆర్థిక సహకారంపై చర్చ!
- సెప్టెంబర్ 11న భేటీ కానున్న మోదీ, పుతిన్
- అజెండాలో ఎస్‌యూ-57 విమానాల డీల్
- వెల్లడించిన క్రెమ్లిన్ అధికార ప్రతినిధి



## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

- రైల్వే మంత్రి కీలక ప్రకటన
- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెండ్



- ప్రకటించిన మండలి ఛైర్మన్
- శాసన మండలిలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలని తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- మూజువాణి పద్దతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్
- సెషన్ మొత్తానికి సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన ఛైర్మన్

హైదరాబాద్

శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్దతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకుముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి- మిగతా3లో

## అరాచకాలను అరికట్టేందుకు అమిత్ షా శాఖ ఏం చేస్తోంది?

- ఢిల్లీలో మణిపురి సంగీతకారుడి కొట్టిచంపిన ఘటనపై రాహుల్‌గాంధీ స్పందన
- ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీలో భద్రత ఉందా అంటూ ప్రశ్న
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, ఢిల్లీ పోలీసుల తీరుపై విమర్శలు



## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే



సెప్టెంబర్‌లో దక్షిణ ద్వీపకల్పంలో వర్షాల పరిస్థితి బలహీనంగానే ఉండే అవకాశం

ఏపీలో 45 శాతం, కేరళలో 24 శాతం వర్షపాతం లోటు

తెలంగాణలో 8 నుంచి 10 వరకు అక్కడక్కడా వర్షాలు

## ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ

- ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు
- నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటు
- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు




హైదరాబాద్

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా.. - మిగతా3లో

# నా వడోదరా అద్భుతం

అభివృద్ధి పనులను ప్రశ్నించే వారిపై ప్రధాని నరేంద్ర మోదీ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వల్ల ట్రక్కు డ్రైవర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించే నారాజ్ ఫూఫా (అలకపాన్పు ఎక్కిన మేనమామ) ఒకరు ఉంటారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆ నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందంటూ చురకలు అంటించారు. గుజరాత్‌లోని వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మోదీ, 2047 నాటికి భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**'నారాజ్ ఫూఫాకు పని దొరికింది**

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ మోదీ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. ఈ కారిడార్ వల్ల ట్రక్కుల అవసరం తగ్గితే ట్రక్కు డ్రైవర్ల పరిస్థితి ఏంటని కొందరు ప్రశ్నిస్తారని అన్నారు. అలాంటి వారిని నారాజ్ ఫూఫాగా అభివర్ణించారు. 'ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏంటి? ట్రక్కులు ఎక్కడికి వెళ్తాయి? ట్రక్కులు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏంటి?' అంటూ వారు ప్రశ్నిస్తారని మోదీ అన్నారు. ఇప్పుడు ఆ నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందని చమత్కరించారు. ఎవరి పేరును ప్రస్తావించకుండానే ఈ వ్యాఖ్యలు చేశారు.

**250 ట్రక్కుల సరుకు ఒకే రైలులో!**

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ సామర్థ్యాన్ని వివరించేందుకు మోదీ ఓ ఉదాహరణ చెప్పారు. ఇటీవల ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ నుంచి వడోదరకు డబుల్‌స్టాక్ కంటైనర్ రైలు నడిచిందని తెలిపారు. ఒకే రైలులో రెండు వరుసల్లో కంటైనర్లను తరలించినట్లు చెప్పారు. ఈ ఒక్క రైలు ప్రయాణంలో తరలించిన సరుకు 250కుపైగా ట్రక్కులు మోసే సామర్థ్యానికి సమానమని వివరించారు. ఇలాంటి రైళ్లతో సరుకు రవాణా వేగంగా జరగడంతో పాటు ఇంధనం, సమయం, రవాణా ఖర్చులు కూడా ఆదా అవుతాయని చెప్పారు.

**2,800 కి.మీ. ఫ్రైట్ కారిడార్ పూర్తి**

దేశంలో సరుకు రవాణా వ్యవస్థలో కీలక మార్పునకు కారణమవుతున్న డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పనులు పూర్తయ్యాయని ప్రధాని ప్రకటించారు. తూర్పు, పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కలిపి మొత్తం 2,800 కిలోమీటర్ల పొడవు ఉన్నాయని తెలిపారు. దేశ వాణిజ్యం, సరుకు రవాణాకు ఈ కారిడార్లు వెన్నెముకగా మారుతున్నాయని మోదీ అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌కు ఇవి లైఫ్‌లైన్‌లా పనిచేస్తున్నాయని చెప్పారు. గతంలో ప్రయాణికుల రైళ్లు, సరుకు రైళ్లు ఒకే ట్రాక్‌పై నడిచేవని, దీంతో ప్రయాణికుల రైళ్ల వేగంతో పాటు సరుకు రవాణా కూడా నెమ్మదించేదని తెలిపారు. ప్రత్యేకంగా సరుకు రైళ్ల కోసం ఏర్పాటు చేసిన కారిడార్ అందుబాటులోకి రావడంతో ఈ సమస్య పరిష్కారమైందన్నారు.

**100 కి.మీ. ప్రయాణం- సగం సమయంలోనే!**

ఫ్రైట్ కారిడార్ వల్ల సరుకు రవాణా వేగం గణనీయంగా పెరిగిందని మోదీ చెప్పారు. గతంలో సరుకు రైలు 100 కిలోమీటర్లు ప్రయాణించడానికి సుమారు 6.5 గంటలు పట్టేదని, ఇప్పుడు అదే దూరాన్ని సగం కంటే తక్కువ సమయంలో చేరుకుంటోందన్నారు. ట్రక్కులో సాధారణంగా 30 గంటలు పట్టే సరుకు రవాణా, ఫ్రైట్ కారిడార్ ద్వారా 10 నుంచి 12 గంటల్లో పూర్తవుతోందని వివరించారు. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గుతుందని, రవాణా ఖర్చులు ఆదా అవుతాయని, సమయం కూడా మిగులుతుందని చెప్పారు. పర్యావరణానికి కూడా ఇది మేలు చేస్తుందని పేర్కొన్నారు.



ప్రస్తుతం తూర్పు, పశ్చిమ ఫ్రైట్ కారిడార్లపై రోజుకు 430కుపైగా సరుకు రైళ్లు నడుస్తున్నాయని మోదీ తెలిపారు.

**2014కు ముందు ఫైళ్లు తిరిగాయ్!**

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వాన్ని కూడా మోదీ విమర్శించారు. ఈ ప్రాజెక్టు ఆలోచన 2004లో ప్రారంభమైందని, 2006లో పనుల కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసినా 2014 వరకు ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదని అన్నారు. ఏళ్ల తరబడి ఫైళ్లు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరుగుతూనే ఉండేవని ఎద్దేవా చేశారు. 2014 తర్వాత కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామని చెప్పారు. గుజరాత్‌లో తనకు లభించిన అనుభవం, అక్కడి ప్రజల నుంచి నేర్చుకున్న పాఠాలను లీక్కి తీసుకెళ్లానని మోదీ తెలిపారు. ఆ అనుభవంతో దేశవ్యాప్తంగా అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు.

**రూ.35 వేల కోట్ల పనులు**

వడోదరలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో మోదీ రూ.35 వేల కోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటిలో పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌కు సంబంధించిన మూడు కీలక విభాగాలు, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారి పనులు, గుజరాత్ ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులు ఉన్నాయి. న్యూ సనంద్, న్యూ మకర్‌పురా, న్యూ ఉంబర్‌గావ్, న్యూ జేఎన్‌పీటీ నుంచి సరుకు రైళ్లను మోదీ ప్రారంభించారు. టాండా రోడ్–వడోదర మధ్య ప్రయాణికుల రైలు సేవలను కూడా ప్రారంభించారు.

**గతిశక్తికి పెద్దపీట**

దేశ అభివృద్ధిలో కనెక్టివిటీ, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం ఉందని ప్రధాని చెప్పారు. పంద్రాగస్టు సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ప్రస్తావించిన సప్తధార సంకల్పంలో గతిశక్తి కూడా ఒకటని గుర్తు చేశారు. దేశంలోని వివిధ రవాణా మార్గాలను సమన్వయం చేయడం, సరుకు రవాణాను వేగవంతం చేయడం, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం ద్వారా గతిశక్తి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై కోచింగ్ ఖర్చుల భారం తగ్గించేందుకు కేంద్రం మరో కీలక అడుగు వేస్తోందని మోదీ తెలిపారు. దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించే వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రతి ఏడాది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పిల్లల కోచింగ్ కోసం మధ్యతరగతి కుటుంబాలు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. అలాంటి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

**ఏఐలో యువత నిపుణులు కావాలి**

ప్రపంచం వేగంగా మారుతోందని దానికి అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాల అవసరాలు కూడా మారుతున్నాయని ప్రధాని అన్నారు. గతంలో డిగ్రీలకు మాత్రమే ప్రాధాన్యం ఉండేదని, ఇప్పుడు నైపుణ్యాలు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత యువత నైపుణ్యాలు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐలో భారత యువత ప్రపంచస్థాయిలో నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మోదీ మరోసారి స్పష్టం చేశారు. రవాణా నుంచి విద్య, నైపుణ్యాల వరకు అన్ని రంగాల్లో ఆధునిక మార్పులు తీసుకురావడమే వికసిత్ భారత్ దిశలో కీలకమని పేర్కొన్నారు.

**నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం**

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు.

"ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# అరాచకాలను అరికట్టేందుకు అమిత్ షా శాఖ ఏం చేస్తోంది?

దిల్లీలో మణిపుర్‌కి చెందిన సంగీత కళాకారుడిని కొట్టి చంపిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజధానిలోనే ఇంటి బయట ఓ తండ్రిని కొట్టి చంపడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పెరుగుతున్న ఈ అరాచకాలను అరికట్టడానికి అమిత్? షా హోం మంత్రిత్వ శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఇంటి బయట శబ్దం తగ్గించమని చెప్పేందుకు కిందికి వెళ్లిన ప్రముఖ మణిపురి సంగీతకారుడిని కొట్టి చంపారు. దేశ రాజధానిలో తన ఇంటి బయటే ఓ తండ్రి హత్యకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో దిల్లీలో నివసిస్తున్న ప్రతి ఈశాన్య ప్రాంతాల కుటుంబం ఒకే ప్రశ్న అడుగుతోంది. ఇక్క మేం సురక్షితంగా ఉన్నామా? ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాలకు చెందిన ప్రజలపై జరుగుతున్న ఘటనలను అరికట్టేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, దిల్లీ పోలీసులు ఏం చేస్తున్నారు. పెరుగుతున్న అరాచకాన్ని నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. త్వరితగతిన ద్యరాప్తు జరిపి, దోషులను న్యాయ స్థానం ముందు నిలబెట్టాలి' అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణం : పవన్ ఖేడా**

మరోవైపు ఈ ఘటనపై కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ పవన్ ఖేడా కూడా తీవ్రంగా స్పందించారు. సంగీతకారుడి మృతి చుట్టు నెలకొన్న పరిస్థితులకు దారి తీసిన సంస్కృతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సృష్టించాయని ఆరోపించారు. 'దీనిని మద్యం మత్తులో జరిగిన హింసాత్మక ఘటనగా కొట్టిపారేయవచ్చు. కానీ దీని వెనక ఇంకా చాలా ఉంది. గత కొన్నేళ్లుగా బహిరంగ ప్రదేశాల్లో భారీ డీజేలు, రచ్చ చేయడం, నిబంధనలను బేఖాతరు చేయడాన్ని ప్రభుత్వం అలవాటుగా మార్చింది. చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సింది పోయి, అధికారంలో ఉన్నవారు కళ్లు మూసుకోవడం వల్లే నేరస్థుల్లో భయం లేకుండా పోయింది. ఈ దారుణానికి దారితీసిన వాతావరణాన్ని సృష్టించిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదు' అని పవన్? ఖేడా అన్నారు. ఈ ఘటనపై ఈశాన్య భారత (నార్త్ ఈస్ట్) కమ్యూనిటీ ప్రతినిధి సంగీతా దేవి కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విక్రమ్ సింగ్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, ఆయన కుటుంబ భవిష్యత్తును ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి**

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, మణిపుర్?కు చెందిన సంగీతకారుడు చోంగ్థామ్ విక్ర సింగ్ (54) దిల్లీలోని కిలోక్రి గ్రామంలో కొన్నేళ్లుగా నివసిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆయన ఇంటి సమీపంలో కొందరు ధాబా, డెలవరీ సిబ్బంది మద్యం సేవిస్తూ గట్టిగా అరుస్తున్నారు. దీంతో సింగ్ బయటకు వచ్చి శబ్దం తగ్గించాలని కోరారు. ఇరువురి మధ్య వివాదం తలెత్తడంతో వారు విక్రమ్? సింగ్?పై పిడిగుద్దులు, దెబ్బలతో దాడి చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తీవ్రసంగా గాయపడిన విక్రమ్?ను ఆయన కుమారుడు వెంటనే హోలీ ఫ్యామిలీ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారని తెలిపారు. ఈ ఘటనపై సన్?లైట్? కాలనీ పోలీస్? స్టేషన్ పీసీఆర్? కాల్ రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, దాడికి దారితీసిన పరిస్థితులు, విక్రమ్ మృతికి కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

**ఏడుగురు అరెస్ట్**

ఘటనకు సంబంధించి పోలీసులు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అలాగే ఓ బాలుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి. దాడి వెనుక ఉన్న పూర్తి కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు విచారణ చేపట్టారు. విక్రమ్ సింగ్ మృతికి ఈశాన్య విద్యార్థి సంఘం కూడా సంతాపం తెలిపింది. దిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ సొసైటీ ఆయనను గౌరవనీయమైన మణిపురి సంగీతకారుడిగా పేర్కొంది.

## బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ముందు, సెప్టెంబర్? 11న దిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ కానున్నారు. ఈ విషయాన్ని రష్యా అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మంగళవారం వెల్లడించారు. తాము కొత్త అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై భారత్‌తో చర్చల కోసం ఎదురుచూస్తున్నామని పెస్కోవ్? చెప్పారు. తమ ఎజెండాలో భారత్‌కు ఎస్‌యూ–57 విమానాల విక్రయం కూడా ఉందని ఆయన తెలిపారు. "భారతదేశం మా వ్యూహాత్మక భాగస్వామి. మేము భారత్?ను అత్యంత ముఖ్యమైన మిత్రదేశంగా పరిగణిస్తాం. ఇరుదేశాల నాయకుల మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య చెల్లింపుల్లో అధిక భాగం సొంత కరెన్సీల్లోనే జరుగుతోంది. ఇది క్రమంగా ఇంకా పెరుగుతోంది. రక్షణ, ఇంధనం, రవాణా, శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారం విస్తరిస్తోంది" అని పెస్కోవ్ పేర్కొన్నారు.

**మోదీ, పుతిన్ చాలా సన్నిహితులు**

దిల్లీలో సెప్టెంబర్ 12 నుంచి బ్రిక్స్ సదస్సు ప్రారంభం కానుంది. ఇందులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్? వివాదానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నాల్లో తన వంతు సహకారాన్ని అందించడానికి భారతదేశం చూపుతున్న సుముఖతను మాస్కో స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. "మరో రెండు రోజుల్లో అధ్యక్షుడు పుతిన్? తన భారత పర్యటనను ప్రారంభిస్తారు. మోదీ, పుతిన్?లు వ్యక్తిగతంగా సన్నిహితులు అనే విషయం మీకు తెలుసు. వారు తమ సంబంధాల విషయంలో ఎంతో ఆచరణాత్మకంగా వ్యవహరిస్తారు. మన ఉమ్మడి ఎజెండాలోని, ద్వైపాక్షిక సంబంధాల్లోని అత్యంత సున్నితమైన అంశాలను కూడా బహిరంగంగా, నిర్మాణాత్మకంగా చర్చించగలిగేంత నిజాయితీ, నమ్మకం వారి మధ్య ఉన్నాయి. ఇది కచ్చితంగా మన మధ్య సహకారానికి సరికొత్త అవకాశాలను తెరుస్తుంది" అని పెస్కోవ్ అన్నారు. భారతదేశంలో కొత్త అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంపై చర్చల కోసం రష్యా ఎదురుచూస్తోందని పెస్కోవ్ తెలిపారు. భారతదేశానికి సుఖోయ్?-57 యుద్ధవిమానాల విక్రయం కూడా తమ ఎజెండాలో ఉందని ఆయన వెల్లడించారు. కొన్ని దేశాలు తమ కరెన్సీలను రాజకీయ అణచివేతకు ఒక సాధనంగా వాడుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

సెప్టెంబర్ నెలలో వర్షాలు దేశవ్యాప్తంగా ఒకేలా ఉండే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, దక్షిణ భారతదేశంలో పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాల తీవ్రత తక్కువగానే ఉంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కేరళలో ఇప్పటికే వర్షపాత లోటు కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో రానున్న రోజుల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తాజా అంచనాల ప్రకారం దక్షిణ ద్వీపకల్పంలో రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితి ప్రాంతాల వారీగా మారనుంది.

**ఏపీలో 45 శాతం వర్షపాతం లోటు**

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 7 వరకు నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే 45 శాతం తక్కువ వర్షం నమోదైంది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అధిక వర్షపాత లోటు ఉన్న ప్రాంతాల్లో ఏపీ కూడా ఉంది. రానున్న రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురిసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. అయితే వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11 ప్రాంతంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్-- దక్షిణ ఒడిశా తీరాల సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

**తెలంగాణకు వరుసగా వర్ష సూచన**

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాల అవకాశాలు క్రమంగా పెరగనున్నాయి. ఐఎండీ తాజా బులెటిన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఆ తర్వాత 12 నుంచి 14 వరకు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అంటే తెలంగాణలో వెంటనే భారీ వర్షాల పరిస్థితి కాకుండా, రానున్న రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

**తమిళనాడుకు భారీ వర్ష సూచన**

దక్షిణాదిలో మరో ముఖ్యమైన మార్పు తమిళనాడులో కనిపించనుంది. సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా సెప్టెంబర్ 11, 12 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. రాయలసీమలో కూడా సెప్టెంబర్ 8 నుంచి 12 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు చెదురుమదురు నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**కేరళలోనూ లోటు**

కేరళలో జూన్ నుంచి సెప్టెంబర్ 7 వరకు 24 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాబోయే రోజుల్లో మాత్రం కేరళ, మాహే ప్రాంతాల్లో కొన్ని దశల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 8, 9 తేదీలతో పాటు 13, 14 తేదీల్లోనూ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అయితే కేరళలో కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు కూడా కొనసాగుతున్నాయి. అందువల్ల రాష్ట్రంలో వాతావరణం ప్రాంతాల వారీగా మారే అవకాశం ఉంది.

**కర్ణాటకలోనూ మారనున్న వాతావరణం**

ఉత్తర కర్ణాటకలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో సెప్టెంబర్ 10, 11 తేదీల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. సెప్టెంబర్ 12 నుంచి 14 మధ్య దక్షిణ కర్ణాటకలోనూ వర్షాల విస్తృతి పెరగొచ్చని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని వాతావరణ పరిస్థితులు ఒకే విధంగా లేవు. ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలకు అవకాశం ఉండగా, దక్షిణ ద్వీపకల్పంలో మాత్రం వర్షాలు ప్రాంతాల వారీగా మారుతున్నాయి. అందుకే వర్షపాతం లోటు ఉన్న రాష్ట్రాల్లో ఒక్కసారిగా భారీ వర్షాలు కురిసినా మొత్తం లోటు వెంటనే పూడిపోదు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 45 శాతం లోటు ఇందుకు ఉదాహరణ. తెలంగాణలో రాబోయే రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం ఉన్నా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో వర్షాలు పడతాయని చెప్పలేం.

## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్–వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

## వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..

దేశవ్యాప్తంగా తీవ్ర వాయు కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకుల్లో ఆసక్తికరమైన ఫలితాన్ని సాధించింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. తీవ్ర శీతాకాలపు పొగమంచు, విషపూరిత గాలి ఉన్నప్పటికీ.. బెంగళూరు (32వ ర్యాంక్), శ్రీనగర్ (26వ ర్యాంక్) వంటి నగరాలను ఢిల్లీ వెనక్కి నెట్టడం గమనార్హం. అయితే, ఈ ర్యాంకులు నగరాల్లోని గాలి నాణ్యతకు ప్రతిబింబం కాదు. కాలుష్య నియంత్రణకు నగరాలు తీసుకుంటున్న చర్యల ఆధారంగానే ఈ సర్వేను నిర్వహించారు. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో అగ్రస్థానంలో నిలవగా, ఇండోర్ రెండో స్థానంలో, జబల్‌పూర్ (195 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాయి. ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గతేడాది 32వ స్థానంతో పోలిస్తే ఢిల్లీ తన ర్యాంకును మెరుగుపరుచుకోవడం విశేషం. ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో, పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద కేంద్రం ఈ సర్వేను నిర్వహిస్తోంది. కేవలం గాలి నాణ్యత స్థాయిలను కాకుండా, కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఈ సర్వే మదింపు చేస్తుంది. రోడ్ల పై దుమ్ము నిర్వహణ, ఘన వ్యర్థాల తొలగింపు, వాహన, పారిశ్రామిక ఉద్గారాల తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, ప్రజల్లో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల, గాలి నాణ్యత తక్కువగా ఉన్న నగరం సైతం.. నియంత్రణ చర్యలను బలంగా అమలు చేస్తే మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది. ఢిల్లీ విషయంలో ఇదే జరిగింది.

**ఢిల్లీలో వాస్తవ పరిస్థితి**

ర్యాంకు మెరుగైనప్పటికీ, ఢిల్లీలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరంగానే ఉన్నాయి. 2025లో పీఎం10 కణాలు జాతీయ సగటు (60 స్త్ర/ఎట) కంటే చాలా ఎక్కువగా 198 స్త్ర/ఎటగా నమోదయ్యాయి. అలాగే పీఎం2.5 కణాలు కూడా నిర్దేశిత పరిమితి (40 స్త్ర/ఎట) కంటే రెట్టింపునకు పైగా 97 స్త్ర/ఎటగా రికార్డయ్యాయి. 2026 జనవరిలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ ×ం ఆంక్షలను కూడా విధించారు. మొత్తం 130 నగరాల్లో ఈ సర్వే నిర్వహించగా, 3–10 లక్షల జనాభా కేటగిరీలో రవుర్కెలా, 3 లక్షల లోపు జనాభా కేటగిరీలో కళింగ నగర్ ప్రథమ స్థానాల్లో నిలిచాయి.

# రెండోరోజూ అదే వేడి

-మొదటిపేజీ తరువాయి

సాగగా, కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసం ముట్టడి కార్యక్రమం, కేసీఆర్‌ను ఉద్దేశించి ఆ పార్టీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు తాజా ఉద్రిక్తతకు, వివాదానికి దారి తీశాయి. మరోవైపు మహిళా పోలీసులపై బీఆర్ఎస్ సభ్యుల దురుసు ప్రవర్తనపై కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇక అసెంబ్లీ లాబీల్లోనూ ఇదే అంశం నడిచింది.

### ఎమ్మెల్యేలతో మంతనాలు

ఉదయం అసెంబ్లీకి రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి స్పీకర్ చాంబర్‌కు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ప్రభుత్వం పక్షాన అండగా ఉంటామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఓదార్చారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి తన చాంబర్‌లో రాష్ట్ర మంత్రులతో పలు దఫాలు సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిల విషయంలో అసెంబ్లీ వేదికగా ఏం చేయాలన్న దానిపై అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతితో చర్చించారు. ప్రభుత్వం తరఫున ప్రవేశపెట్టే తీర్మానం ఎలా ఉండాలి? భవిష్యత్తులో న్యాయ వివాదాలు రాకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే విషయాలపై మాట్లాడిన సీఎం.. ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని శాసనమండలిని కోరుతూ శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహతో తీర్మానం ప్రతిపాదింపజేసి, ఆమోదింపజేయాలని నిర్ణయించారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు కూడా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చించారు. కాంగ్రెస్ ముట్టడి కార్యక్రమాన్ని ధీటుగా ఎదుర్కోవాలని, ఎమ్మెల్సీలు మాత్రం సభలోనే ఉండాలని నిర్ణయించారు. తాతా మధు, నవీన్‌రెడ్డిల సస్పెన్షన్ నేపథ్యంలో నిరసనలు, ధర్నాతో బీఆర్ఎస్ నేతలు వాతావరణాన్ని మరింత వేడెక్కించారు.


### 'అనుచిత వ్యాఖ్యలపై'చర్చ..సస్పెన్షన్ తీర్మానం

మంగళవారం మధ్యాహ్నం సభ ప్రారంభమైన తర్వాత ప్యానెల్ స్పీకర్ స్థానంలోకి వచ్చిన కడియం శ్రీహరి సోమవారం నాటి అనుచిత వ్యాఖ్యల వ్యవహారంపై చర్చను ప్రారంభించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించగా, పలువురు మహిళా ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడారు. ఆ తర్వాత మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యకు విజ్ఞప్తి తీర్మానం ప్రవేశపెట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడిన తర్వాత ఈ తీర్మానాన్ని సభ ఆమోదించి శాసనమండలికి పంపింది.

### స్పీకర్ మనస్తాపం..

తాతా మధు ఎపిసోడ్‌లో కాంగ్రెస్ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించింది. అసెంబ్లీలో మాట్లాడిన హరీశ్‌రావు వీలున్నంత వరకు తమ పార్టీ ఎమ్మెల్సీలకు మద్దతుగా నిలిచే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగానే స్పీకర్ ప్రసాద్‌కుమార్ కొంత ఆవేశానికి లోనయ్యారు. హరీశ్‌రావును ఉద్దేశించి ఆగ్రహంగా వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల వైఖరి, హరీశ్‌రావు వ్యాఖ్యలకు స్పీకర్ మనస్తాపం చెందారు. ఉదయం సభను కొంతసేపు వాయిదా వేసిన అనంతరం చాలాసేపు ఆయన తన చాంబర్‌లోనే ఉన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు అసెంబ్లీ కార్యదర్శితో మాట్లాడారు. విలేకరులతో ఇష్టాగోష్టిలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ తర్వాత సభ లోపలికి వెళ్లిన ఆయన మనస్తాపం కారణంగా కొద్దిసేపు మాత్రమే సభా కార్యకలాపాలు నిర్వహించి, ప్యానల్ స్పీకర్ కడియం శ్రీహరికి సభాధ్యక్షత బాధ్యతను అప్పగించి వెళ్లిపోయారు.



### మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై..కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలు మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతి, మట్టా రాగమయి, పరి?ణకారెడ్డి, యశస్వినిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మహిళా నేతలు కల్వ సుజాత, గుండు సుధారాణి, ఇందిరా శోభన్‌లు మహిళా కమిషన్‌ను కలిశారు. మహిళా పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించారని, వారి ముందే అర్ధనగ్న ప్రదర్శన చేశారని, అనుచితంగా వ్యవహరించారంటూ కమిషన్ కార్యదర్శి, సభ్యులకు ఫిర్యాదును అందజేశారు.

### తగ్గని బీఆర్ఎస్

**-- అసెంబ్లీ లోపలా, బయటా ఆందోళనలు**

**-- నల్ల బ్యాడ్జీలతో సమావేశాలకు హాజరు**

**-- కాంగ్రెస్ చేపట్టిన కేసీఆర్ ఎర్రవల్లి నివాసం ముట్టడి కార్యక్రమంపై మండిపాటు**

**-- తాతా మధు, నవీన్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన, ధర్నా**

ప్రదాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అసెంబ్లీ లోపలా, బయట అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం కొనసాగించింది. మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల బ్యాడ్జీలు ధరించి సమావేశాలకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన చర్చల్లో ప్రతిష్టంభన నెలకొనడంతో స్పీకర్ సభకు విరామం ప్రకటించారు. ఈ నేపథ్యంలో శాసనసభ లాబీల్లోని బీఆర్ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. సభ లోపలా బయటా కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎత్తుగడలపై చర్చించారు. ఎర్రవల్లిలో పార్టీ అధినేత కేసీఆర్ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్తున్నట్లు అందిన సమాచారంపై చర్చించారు. వారికి పోలీసులు సహకరిస్తున్నారని తెలియడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఎర్రవల్లికి వెళ్లాలని నిర్ణయించారు. అయితే పార్టీ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తారనే వార్తల నేపథ్యంలో ఎమ్మెల్సీలు మాత్రం సభలోనే ఉండాలని నిర్ణయించారు.

### బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట

ఎర్రవల్లిలో కేసీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అయితే రాజీవ్ రహదారి మీదుగా ఎర్రవల్లికి వెళ్లే క్రమంలో నగర శివారులోని బొల్లారం, హకీంపేట వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై నిరసన తెలుపుతూ తమ వాహనాల నుంచి దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలి నడకన ఎర్రవల్లికి బయలుదేరారు. అయితే హరీశ్‌రావుతో పాటు కొందరు ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపిన కేటీఆర్‌తో పాటు మరికొందరు ఎమ్మెల్యేలను బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పార్టీ ఎమ్మెల్యేల అరెస్టు వార్తను తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్లకు చేరుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. బోయినపల్లి పోలీసు స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం తోపులాటకు, దాడికి దిగాయి. సాయంత్రం ఐదు గంటల వరకు నేతలను పోలీసు స్టేషన్‌లోనే నిర్బంధించిన పోలీసులు ఆ తర్వాత వదిలి పెట్టారు. పోలీసు నిర్బంధం నుంచి విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సాయంత్రం తిరిగి అసెంబ్లీకి చేరుకున్నారు.

### నిరసనలు..ధర్నా

తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల అసెంబ్లీ బయట పోలీసులు దురుసుగా వ్యవహరించారని, ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ మంగళవారం శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చింది. మరోవైపు తమ పార్టీ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేయడంపై మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ నిరసన తెలపడంతో సమావేశాలకు అంతరాయం కలిగింది. తర్వాత సాయంత్రం మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. మండలి చైర్మన్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో జరిగిన నిరసనలో ఏకపక్షంగా సస్పెన్షన్ విధించి సభను వాయిదా వేసుకుని వెళ్లారని విమర్శించారు. సస్పెన్షన్‌కు సంబంధించిన శాసనసభ తీర్మానం కాపీని తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చ లేకుండా ఎమ్మెల్సీల సస్పెన్షన్‌కు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కొద్దిసేపు గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ.. ధర్నా నిర్వహించారు. ఆ తరువాత వారిని పోలీసులు అక్కడ నుంచి పంపించేశారు. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా అసెంబ్లీ మార్షల్స్ ఆయనను అడ్డుకున్నారు. మధు, నవీన్‌కుమార్‌రెడ్డిని బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లడంతో బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కేసీఆర్‌ను ఉద్దేశించి షాద్‌నగర్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ నేతలు మండిపడ్డారు.

# కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వామోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విభేదాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు



బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రాంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకోవడం, ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెండ్

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ ఆమోదం తెలిపింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోందని, మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది.

బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

### సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్?ను బీఆర్?ఎస్ సభ్యులు ఖండించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను చట్ట విరుద్ధంగా సస్పెండ్ చేశారని శాసనమండలి ఆవరణలో బైఠాయించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

### తాతా మధు మాట్లాడకుండా అడ్డుకున్న మార్షల్స్

తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్ అనంతరం ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా మార్షల్స్ అడ్డుకున్నారు. సస్పెన్షన్ వేటు పడినందున ప్రాంగణంలో మాట్లాడవద్దని అధికారులు తెలిపారు. తాతా మధును అదుపులోకి తీసుకుని వ్యానులో తరలించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు బీఆర్?ఎస్?ఎల్పీలో ఆ పార్టీ సభ్యులు సమావేశమయ్యారు.

## ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

మరో రూ.489.93 కోట్లను ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా సమకూర్చనుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నిర్మాణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలలోనే నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, అచ్చంపేట నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, గజ్వేల్‌లో ఒక టీపీఎస్‌కు అనుమతులు లభించాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆరుట్ల టీపీఎస్ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిపాదించిన 95 పాఠశాలల్లో 73కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పటివరకు మంజూరైన టీపీఎస్‌ల సంఖ్య 78కు చేరింది. మిగిలిన పాఠశాలలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు భిన్నంగా టీపీఎస్‌లు సెమీ రెసిడెన్షియల్ విధానంలో పనిచేయనున్నాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కూడా అవసరమైన మౌలిక వసతులతో టీపీఎస్‌లుగా తీర్చిదిద్దనున్నారు. సాధారణంగా కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి.. వాటి పరిధిలోని సమీపంలోని మరో రెండు, మూడు పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని అనుసరించనున్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని జూనియర్ కళాశాలలను కూడా ఈ సముదాయాల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.టీపీఎస్‌లలో విద్యార్థులకు తరగతి గదులతో పాటు క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, గ్రంథాలయాలు, కంప్యూటర్–సైన్స్ ల్యాబ్‌లు, ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రీప్రైమరీ నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే క్యాంపస్‌లో అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాలల విలీనం ద్వారా ఒక్కో టీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య కనీసం 1000 నుంచి 1500 వరకు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదవడం ద్వారా మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, వనరులను సమర్థంగా వినియోగించడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందుతున్న నేపథ్యంలో.. టీపీఎస్‌లలో సాయంత్రం కూడా అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే టీపీఎస్‌ల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

## స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?

-మొదటిపేజీ తరువాయి



సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు.

చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారు

సభను సజావుగా నడిపించే బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని ఏజీ వాదించారు. ప్లకార్డులు, రాతలతో కూడిన నల్ల టీషర్టులతో శాసనసభలోకి ప్రవేశం లేదన్నారు. స్పీకర్ ఆదేశాలతో చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారన్నారు. అసెంబ్లీ పరిసరాల్లో ర్యాలీలు, నిరసనలపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ సీపీ ఆదేశాలు కూడా అమల్లో ఉన్నాయని ఏజీ వాదించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యేలను శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పోలీసులు అడ్డుకున్నారని ఏజీ వాదనలు వినిపించారు.

### మహిళా పోలీసులతో అనుచితంగా ప్రవర్తించారు

విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారని న్యాయస్థానం దృష్టికి ఏజీ తీసుకొచ్చారు. ఇతర పోలీసు అధికారులను కూడా దూషించారని ఏజీ తెలిపారు. నల్ల టీషర్టులు ధరించి ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించేలా ఎమ్మెల్యేలు ప్రవర్తించారని ఏజీ కోర్టుకు తెలిపారు. ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న కోర్టు ఉత్తర్వులను సవరించాలని ఏజీ కోరారు.

### స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?

అయితే ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, శాసనసభ నియమావళిని ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా అని ఏజీని ప్రశ్నించింది. పోలీసులు ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల పట్ల ఎందుకు అనుచితంగా ప్రవర్తించారని హైకోర్టు ప్రశ్నించింది. పోలీసులు ఎవరితోనూ అలా ప్రవర్తించలేదని, మహిళా ఎమ్మెల్యేలను లోపలికి వెళ్లకుండా అడ్డుకోలేదని ఏజీ వాదించారు. నియమావళిలోని విషయాలను శాసనసభ్యులకు ఘటన కంటే ముందే తెలియజేశారా అని హైకోర్టు ప్రశ్నించగా, సాధారణంగా అమల్లో ఉండే నిబంధనలేనని ఏజీ తెలిపారు.

### తెలంగాణ భవన్‌కు ఎందుకు తీసుకెళ్లారు

సభ్యులను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు లేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదించారు. చీఫ్ మార్షల్?కు స్పీకర్ ఆదేశాలున్నట్లు ఎలాంటి లేఖలు ప్రభుత్వం సమర్పించలేదన్నారు. ఎమ్మెల్యేలు ఏదైనా నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కానీ పోలీసులు కాదని బీఆర్ఎస్ న్యాయవాది వాదించారు. నిన్న పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్?లో పేర్కొన్న అంశాలనే ప్రభుత్వం కౌంటర్?గా దాఖలు చేసిందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని, భావిస్తే సదరు ఎమ్మెల్యేలను స్పీకర్ దగ్గరికి తీసుకెళ్లకుండా, అరెస్ట్ చేసి తెలంగాణ భవన్?కు ఎందుకు తీసుకెళ్లారని వాదించారు. సోమవారం నాటి కోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో కోర్టు తీర్పును రిజర్వు చేసింది.

## సంపాదకీయం

# 'కూలిన' జవాబుదారీతనం


దక్షిణ ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఐదు అంతస్థుల పెయింగ్ గెస్ట్ హాస్టల్ భవనం కుప్పకూలి, పలువురు విద్యార్థులు దుర్మరణం పాలవడం మనసులు కలచివేస్తున్నది. యాభైయేళ్ళనాటి భవనానికి బేస్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులు చేపట్టడంతో అది పేకమేడలాగా కుప్పకూలింది. అప్పటికే వర్షాలకు తడిసిముద్దయి ఉన్న ఈ భవనం బేస్‌మెంట్‌లోకి నీరు కూడా చేరివున్న స్థితిలో, నిపుణుల పర్యవేక్షణ లేకుండా రిపేర్లు చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. రాష్ట్రపతి, ప్రధాని సహా పెద్దలంతా ఈ ప్రమాదం మీద కూడా ఆశ్చర్యాన్నీ, ఆవేదననూ ప్రకటించారు. బాధిత కుటుంబీలకు సానుభూతి తెలియచేశారు. ప్రమాదం జరిగిన తరువాత మనదేశంలో సకల వ్యవస్థలూ స్పందించే తీరు, వేగం ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటుంది. ఏకంగా పదిపోలీసు బృందాలు, మూడు రాష్ట్రాలను జల్లెడపట్టి, రాజస్థాన్‌లో దాక్కున్న ఈ భవనం యజమానిని ఢిల్లీ లాక్కొచ్చాయి. ఆయన సహా కొందరు కుటుంబీలను సైతం అరెస్టుచేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా స్పందిస్తూ మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు. సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ సహా ఐదుగురు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) అధికారులు సస్పెండ్ అయ్యారు. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై ఇకపై 'జీరో టాలరెన్స్' విధానం అమలవుతుందట. అంతేనా? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా ఉండేందుకు ఢిల్లీలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాలకు స్ట్రక్చరల్ ఆడిట్ తప్పనిసరి చేస్తున్నట్లు కూడా ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. హాస్టల్ భవనాల నిర్మాణవేగాన్ని పెంచవలసిందిగా తమ అనుబంధ కళాశాలలకు ఢిల్లీ యూనివర్సిటీ వీసీ ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ హైకోర్టు కూడా ఈ ప్రమాదఘటనపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతూ, నగరంలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాల్లో విద్యార్థుల భద్రత మీద వారంలోగా నివేదిక ఇవ్వాలని కేంద్రానికీ, ఢిల్లీ ప్రభుత్వానికీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కూడా బీజేపీ అధీనంలోనే ఉన్నందున ఈ ఘటనను ట్రిపుల్ ఇంజన్ సర్కారు వైఫల్యంగా కాంగ్రెస్ అభివర్ణిస్తోంది. ఢిల్లీ పీజీ హాస్టల్ వ్యాపారం అంతా బీజేపీ నాయకులు, వారి మద్దతుదారుల అధీనంలో నడుస్తోందని ఆప్ విమర్శిస్తోంది. ఇటువంటి ఘోరాలు జరగ్గానే వ్యక్తులు, వ్యవస్థలు ఎలా ఉలిక్కిపడతాయో గతంలోనూ చూసిందే. ఎంతటివారినైనా వదిలేది లేదని నాయకులు హామీ ఇవ్వడం నుంచి, న్యాయస్థానాలు వాపోవడం వరకూ అంతా వింటున్నదీ కంటున్నదే. ఢిల్లీ 'ప్రమాదాల' జాబితాలోకి ఇప్పుడు సత్యనికేతన్ ఘటన కొత్తగా వచ్చిచేరింది అంతే. దీనికిముందు ఒక హాస్టల్ భవనం మునిగిపోవడం నుంచి, ఒక గెస్ట్‌హౌస్ తగలబడిపోవడం వరకూ అనేకం చూశాం. ఆరు గదులకు అనుమతి తీసుకొని, పాతిక గదుల్లో జనాన్ని నింపి, బేస్‌మెంట్లో రెస్టారెంట్ నిర్వహించిన కారణంగా, ఆ ఐదంతస్తుల భవనం అగ్నికి ఆహుతై విదేశీయులతో సహా పలువురు విద్యార్థులు సైతం ప్రాణాలు పోగొట్టుకున్న మాలవీయనగర్ విషాదం మూడునెలల క్రితమే జరిగింది. దానికి సరిగ్గా మూడురోజుల ముందే, దక్షిణ ఢిల్లీలోని సాకేత్ మెట్రోస్టేషన్ సమీపంలోని భవనం కూలి పలువురు విద్యార్థులు మరణించారు. వీరంతా పొరుగున ఉన్న కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ ఈ హాస్టల్‌లో ఉంటున్నవారు. రాకపోకలకు ఒకేమార్గం ఉన్న ఈ భవనం ఎత్తును అక్రమంగా పెంచుతున్నారని విద్యార్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఒకపక్క పైన బరువు పెంచి, మరోవైపు బేస్‌మెంట్‌లో సంప్ విస్తరణకోసం జరిపిన తవ్వకాలు దాని పునాదినే బలహీనపరచాయి. ఢిల్లీలో గత మూడేళ్ళలో వెయ్యికి పైగా భవనాలు వివిధ కారణాలవల్ల కూలినట్టు నివేదికలు చెబుతున్నాయి. విషాదం జరిగిన ప్రతీసారి ప్రభుత్వం ఏవో చర్యలు ప్రకటిస్తుంది, ఎవరినీ క్షమించేది లేదని, రక్షించేది ఉండదని అంటుంది. భద్రమైన భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తుంది. కానీ, మరో విషాదం జరిగేవరకూ ఊపిరిబిగబట్టి ఎదురుచూడటం వినా జనం చేయగలిగిందేమీ లేకపోతోంది. భద్రంగా లేని భవనాలు, అక్రమ నిర్మాణాలు, చట్టవిరుద్ధ వ్యాపారాలతో ఢిల్లీ ఒక్కటే కాదు, దేశంలోని నగరాలన్నీ వెలుగుతున్నాయి. దీనిని పర్యవేక్షణ లోపంగా చూడటం కంటే, మొత్తం నియంత్రణ వ్యవస్థ కుప్పకూలిందనడం సమంజసం. అవినీతి ఆకాశాన్ని అంటుతున్నదని, జవాబుదారీతనం మటుమాయమైందనీ ఈ విషాద ఘటనలు తెలియచెబుతాయి.

# నిజరూప పట దర్శనం!

మాటలు కావొచ్చు, చేతలు కావొచ్చు-- ఏవీ శూన్యంనుంచి ఊడిపడవు. అనుద్దేశపూర్వకంగా, యథాలాపంగా ఏవీ ఉండవు. వాటిని ఉపయోగించేవారికి ఆ సంగతి తెలియొచ్చు... తెలియకపోవచ్చు. ఒక్కోసారి బాధితులకు కూడా అర్థం కాకపోవచ్చు. కానీ వివక్షను ఎత్తిచూపినప్పుడు సరిదిద్దుకోవటం సంస్కారం. ఈ విషయంలో వ్యక్తుల్ని కొంతవరకూ క్షమించవచ్చు. కానీ ప్రపంచ దేశాల సారథి ఐక్యరాజ్యసమితిని క్షమించగలమా? ప్రపంచ పటంలో మా ఖండాన్ని చిన్నబుచ్చుతున్నారని ఆఫ్రికా దేశాలు దశాబ్దాలుగా ఎత్తిచూపుతున్నాయి. అయినా దాన్ని సరిదిద్దుకోవటానికి దీర్ఘకాలం పట్టింది. ఎట్టకేలకు మొన్న శుక్రవారం దాన్ని సవరించుకుంది. ఏకంగా 164 దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తే, ఎప్పట్లానే అమెరికా ఉలిపికట్టె ధోరణి ప్రదర్శించింది. ఎప్పుడో పదహారో శతాబ్దంనాటి మాట. భౌగోళిక పటాల రూపకర్త గెరార్డస్ మెర్కేటర్ తొలిసారి 1569లో ప్రపంచ పటాన్ని రూపొందించాడు.

దక్షిణార్ధ గోళ దేశాలను, ముఖ్యంగా భూమధ్య రేఖ సమీప దేశాలను వాటి వాస్తవ పరిమాణంకన్నా తక్కువగా చూపాడాయన. అప్పటికున్న పరిజ్ఞానం పరిమితుల్లో అలా చేశాడని సరిపెట్టుకోవటానికి లేదు. అదే నిజమైతే ఉత్తరార్ధ గోళ దేశాలనూ, ధ్రువాలకు సమీపంలో ఉన్నవాటినీ పెంచి ఎలా చూపగలిగాడు? ఏమైతేనేం... ప్రపంచపటం ఇన్నాళ్లకు సక్రమమైంది. ఖండాలను వాటి నిష్పత్తికి అనుగుణమైన వైశాల్యాల్లో రూపొందించారు. కానీ ఆ క్రమంలో మన జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాలను ఆ పటం చైనా, పాకిస్తాన్‌లకు 'పంచిపెట్టింది'. మన విదేశాంగ శాఖ చెప్పినట్టు ఇదేమీ దేశాల హద్దుల్ని అధికారికంగా నిర్ధారించేది కాకపోవచ్చు. కానీ ఒక తప్పును సరిదిద్దుకునే క్రమంలో కొత్త తప్పుల్ని చేయరాదన్న ఇంగిత జ్ఞానం లోపించింది. అమెరికాలో కొంత భూభాగాన్ని వేరేవాళ్ల ఖాతాలో వేసి ఉంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఊరుకునేవారా?

అవతలివారిపై ఆధిక్యతాభావం మనిషి నరానరాల్లోనూ వ్యాపించిన జాడ్యం. దీనికి భౌగోళిక హద్దులేమీ లేవు. అది జాత్యహంకారంగా, వర్ణవివక్షగా, ఆర్థికంగా అధికులమనే భావనగా వ్యక్తం కావటం ఎవరికీ తెలియంది కాదు. కులాన్నిబట్టి, మతాన్నిబట్టి మేం అధికులం, అన్యులు అల్పులన్న భావన ప్రబలంగా ఉండటం మన అనుభవంలో




ఉన్నదే. తెల్లతోలు ఉన్నవాళ్లు అసాధారణ మానవులు, మిగిలినవాళ్లంతా అల్పులనే భావన పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికీ పోలేదు. హిట్లర్ హయాంలో యూదుల్ని జర్మనీ వెంటాడి, వేటాడి హతమార్చటం వెనుకా... ఎనిమిది దశాబ్దాలపైగా పాలస్తీనాలో మారణహోమాన్ని సాగిస్తున్న అమానుష ఇజ్రాయెల్ వెనకా ఈ జాడ్యం తాలూకు ఛాయలే కనబడతాయి. అమెరికాలో కనబడే శ్వేతజాతి అహంకారం కూడా ఈ బాపతే. మనిషి అంతరాంతరాల్లో ఇలాంటివి గూడు కట్టుకున్నప్పుడు వారి వ్యవహార శైలిలో అది ప్రతిబింబించక మానదు. ఒక ప్రాంత భౌగోళిక వైశాల్యం ఎంతో చెప్పే పటాలు చూడటానికి అన్నిటికీ అతీతంగా, అలీనంగా కనబడతాయి. కానీ పటాల రూపకల్పనలో చోటుచేసుకునే రాజకీయాల గురించి 2020లో కార్నెల్ వర్సిటీ అధ్యాపకురాలు క్రిస్టిన్ లూయెన్‌బెర్గర్ చాలా సంగతులే చెప్పారు. దృగ్గోచరమయ్యే రాజకీయాలతో పాటు, ప్రచ్ఛన్నంగా, గుట్టుగా ఉండిపోయే రాజకీయాలు కూడా ఈ పటాల రూపకల్పనలో ఉంటాయని ఆమె అభిప్రాయం. ప్రతి పటమూ చూపవల్సినంతగా చూపుతూనే, దాచాల్సింది దాస్తుందనీ, నిర్దిష్ట సమూహం కోసమే ఇదంతా జరుగుతుందనీ క్రిస్టిన్ అంటారు. గుండ్రంగా ఉండే భూమిని చదునైన కాగితంపై చూపితే కొంత వక్రీకరణ ఎలాగూ తప్పదు. కానీ గ్రీన్‌ల్యాండ్ కన్నా 14 రెట్లు పెద్దదైన ఆఫ్రికా... దాని ముందు చిన్నబోవట మేమిటి? యూరప్, అమెరికాలు కూడా తమ వాస్తవ విస్తీర్ణంకన్నా అధికంగా కనబడతాయెందుకు? ఆఫ్రికాతోపాటు దక్షిణ అమెరికా, భారత్‌లు చిన్నగా ఉంటాయి. కాగితాల్లో తప్పుడు గీతలు గీసి అధికులమనుకోవటం... తరగతి గదుల్లో రూపుదిద్దుకునే తరాలకు అజ్ఞానాన్ని బట్వాడా చేయటం సిగ్గుచేటు కాదా? సమితికి ఇంతకన్నా ప్రాధాన్యం గలవి చాలా ఉన్నాయని ట్రంప్ ఉవాచ. అందుకే తీర్మానాన్ని వ్యతిరేకించారట. నిజమే... ప్రాధాన్యం గలవి ఇంకా ఉన్నాయి. ఆ లెక్కలు కూడా తేలిస్తే అమెరికా వంచన మరింత తేటతెల్లమవుతుంది!

# చట్టసభల గుమ్మంలో ప్రజాస్వామ్య ద్రోహం

ప్రజాస్వామ్యానికి దేవాలయాలుగా, కోట్లాది మంది ప్రజల ఆశాజ్యోతులుగా వెలుగొందే చట్టసభల ప్రాంగణం నేడు అధికారమదంతో కూడిన పోలీసు దౌర్జన్యాలకు వేదికగా మారడం సమకాలీన రాజకీయ చరిత్రలో అత్యంత అసహ్యకరమైన, లజ్జాకరమైన అధ్యాయం. శాసనసభ ముంగిట ప్రతిపక్ష బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన అనాగరిక, దురహంకారపూరిత తీరు రాజ్యాంగ స్ఫూర్తిని నిలువునా దహించివేసింది. ప్రజల గొంతుకగా అసెంబ్లీకి వస్తున్న మహిళా ప్రజాప్రతినిధుల జుట్టు పట్టుకుని లాగడం, గొంతు నులమడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చీరలు లాగుతూ వ్యవహరించడం ఏ రకమైన పాలనకు సంకేతం? ఇది కేవలం కొందరు నేతలకు జరిగిన పరాభవం కాదు; ఇది దేశంలోని మొత్తం మహిళా సమాజానికి, రాజ్యాంగ వ్యవస్థలకు జరిగిన పూడ్చలేని గాయం. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలుపడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై నిలదీయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ప్రభుత్వ వైఫల్యాలు, పనితీరుపై ప్రజాప్రతినిధులు శాసనసభకు వచ్చి నిరసనను వ్యక్తం చేయడం అనాదిగా వస్తున్న ప్రజాస్వామ్య సంప్రదాయం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు శాసనసభకు చేరుకున్న మాజీ మంత్రులు, సీనియర్ శాసనసభ్యులమైన నాపై (పి. సబితా ఇంద్రారెడ్డి), సునీతా లక్ష్మారెడ్డితోపాటు ఇతర మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రదర్శించిన నిర్బంధ వైఖరి శాంతిభద్రతల పరిరక్షణ కాదు; అది కేవలం అధికారపక్ష అణచివేత ధోరణి. శాసనసభ ముంగిట నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, భౌతిక దాడులకు పూనుకోవడం రాజ్యాంగబద్ధమైన పాలన స్థానే పోలీసు రాజ్యాన్ని ప్రతిష్ఠించే కుట్రలా కనిపిస్తున్నది. 'ప్రజాపాలన' అనే పదబంధాన్ని ఊతపదంగా వాడుకొనే ప్రస్తుత పాలకుల అసలు రంగు ఈ ఘటనతో పూర్తిగా బయటపడింది. ఈ ఘోర కలికి కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయ స్థాయిలో మాట్లాడే నీతులకు, రాష్ట్ర స్థాయిలో వారు అనుసరిస్తున్న అణచివేత చర్యలకు ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని ఎండగట్టాల్సిన అవసరం ఉన్నది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నల్లచొక్కాలు ధరించి, పోస్టర్లు పట్టుకొని నిరసన తెలిపినప్పుడు అది ప్రజాస్వామ్య పరిరక్షణగా, రాజ్యాంగ హక్కుగా ఊదరగొట్టిన ఆ పార్టీ నాయకత్వం, నేడు తెలంగాణ అసెంబ్లీ వద్ద ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్ట్‌లతో అసెంబ్లీకి వస్తే పోలీసులతో దాడి చేయించడంలో ఉన్న ఔచిత్యం ఏంది? జాతీయ స్థాయిలో ఒక రాజ్యాంగ సూత్రం, స్వయంగా అధికారంలో ఉన్న రాష్ట్రంలో మరొక అణచివేత సూత్రం చెల్లుబాటు అవుతుందా? రాహుల్ నిరసన తెలిపితే అది పోరాటం, తెలంగాణలో మహిళా ప్రజాప్రతినిధులు నిరసన తెలిపితే నేరమా? ఈ దగాకోరు ద్వంద్వవిధానాన్ని ప్రజాస్వామ్యవాదులు ఏవిధంగా సమర్థిస్తారు? భారత రాజకీయ చరిత్రను తిరగేస్తే, చట్టసభల లోపల లేదా వెలుపల మహిళా నేతలపై భౌతికదాడులకు దిగిన ప్రతి సందర్భంలోనూ పాలకులు ప్రజల ఆగ్రహపాటుకు గురయ్యారనేది స్పష్టమవుతున్నది. తమిళనాడు శాసనసభలో నాటి ప్రతిపక్ష నేత జయలలితపై అసెంబ్లీ ప్రాంగణంలో దాడి చేసి, ఆమె చీరను లాగి అవమానించినప్పుడు, కన్నీళ్లతో బయటకువచ్చిన ఆమె మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడుతానని శపథం చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ రాష్ట్ర



రాజకీయ చిత్రాన్నే మార్చేశాయి. 1995లో ఉత్తరప్రదేశ్‌లో మాయావతిపై జరిగిన భౌతికదాడి నాటి ప్రభుత్వ పతనానికి నాంది పలికింది. కేరళ శాసనసభలో 2015 బడ్జెట్ సమావేశాల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన అణచివేత చర్యలు తీవ్ర వ్యతిరేకతకు దారితీశాయి. సింగూర్ ఉద్యమ సమయంలో టీఎంసీ అగ్ర నేత మమతా బెనర్జీని పోలీసులు ఈడ్చిపారేసిన దృశ్యాలు వామపక్ష ప్రభుత్వ శాశ్వత పతనానికి బాటలు వేశాయి. చరిత్ర నేర్పిన ఈ గుణపాఠాలను కాంగ్రెస్ పాలకులకు గుర్తుచేయాల్సిన అవసరం ఉన్నది. అధికారమదంతో మహిళా నేతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు ఏ ప్రభుత్వం పూనుకున్నా, కాలక్రమంలో వారు తీవ్ర రాజకీయ పరిణామాలను ఎదుర్కోక తప్పదు. ఒకవైపు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాలు తెస్తున్నామని గొప్పలు చెప్పుకొనే రాజకీయ వ్యవస్థ, మరోవైపు ఎన్నుకైన మహిళా ప్రజాప్రతినిధుల మీదనే ఈ రకమైన తీవ్ర భౌతికదాడులకు దిగడం హేయమైన చర్య. మాజీ మంత్రులుగా, శాసనసభ్యులుగా సమాజంలో ఎంతో గౌరవం ఉన్న నాకు (సబితా ఇంద్రారెడ్డి), సునీతాలక్ష్మారెడ్డి వంటి సీనియర్ నాయకులకే రక్షణ లేకపోతే, రేపు రాజకీయాల్లోకి రావాలనుకునే సాధారణ మహిళలకు ఈ వ్యవస్థ ఎలాంటి సంకేతాన్ని ఇస్తుంది?. ద్రౌపది వస్త్రాపహరణం సభామధ్యలో జరిగినప్పుడు మౌనంగా ఉన్న రాజ్యాంగ వ్యవస్థలు ఏ విధంగా కూలిపోయాయో మహాభారతం చెప్పింది. నేడు శాసనసభ గుమ్మం వద్ద జరిగిన ఈ ఘోరం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన మహమ్మారే. ప్రస్తుత ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి. పోలీసు బలగాలను ఉపయోగించి ప్రతిపక్షాలను, ప్రత్యేకించి మహిళా నేతలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడం ద్వారా పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరు. మహిళా శాసనసభ్యుల చీరలు లాగిన, గొంతు నొక్కిన, జుట్టు పట్టుకుని లాగిన పోలీసు అధికారులను తక్షణమే గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించి, వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా? లేదా, ఈ వికృతచేష్టలకు తామే స్వయంగా ఆదేశాలిచ్చామని, పోలీసుల 'అతి' వెనుక ప్రభుత్వ హస్తం ఉన్నదని బహిరంగంగా ఒప్పుకొంటారా? తాత్కాలికంగా పోలీసు బలగాల వెనుక దాక్కొని, భౌతిక దాడుల ద్వారా ప్రతిపక్షం నోళ్లు మూయించి పాలకులకు పైశాచిక ఆనందం కలుగవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదనే సత్యాన్ని విస్మరించవద్దు. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలోకి రాక తప్పదు. చట్టసభల గౌరవాన్ని, నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును, మహిళా ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని కాలరాస్తే, రేపు ప్రజ ల ఆధ్వర్యంలో ఎదురయ్యే నిరసన మంటలకు ప్రభుత్వం బలికావడం ఖాయం! ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, తన ప్రజాస్వామ్య వ్యతిరేక తీరును మార్చుకోవాలని హెచ్చరిస్తున్నాం.

# బీఆర్ఎస్ పుట్టుకే దళిత వ్యతిరేకం

**ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఫైర్**

**స్పీకర్ తల్లిని అవమానించిన ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలి.**

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు...**

**హైదరాబాద్ సెప్టెంబర్ 9 (అగ్నిధార న్యూస్):**



టీఆర్ఎస్, బీఆర్ఎస్ పార్టీ పుట్టుకతోనే దళిత వ్యతిరేక పార్టీ అని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ లో జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిని సభ్య సమాజం తలదించుకునేలా అవమానపరిచిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు పథకం ప్రకారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్, హరీష్ రావులతో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు వీధి రౌడీల లాగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎంతో సౌమ్యులు, హుందాగా ప్రవర్తించే స్పీకర్ తల్లి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనపై ఈరోజు అసెంబ్లీలో క్షమాపణ చెబుతారని భావించామని, కానీ హరీష్ రావు, కేటీఆర్లు వారిని వెనకేసుకురావడం చూస్తే పార్టీ మద్దతుతోనే ఈ వ్యాఖ్యలు చేశారని అర్థమవుతుందన్నారు. ఆది నుంచి కేసీఆర్ దళిత వ్యతిరేకిగా ముద్రపడ్డారని విజయ రమణారావు అన్నారు. వర్గీకరణ ఉద్యమం కోసం పాటుపడిన దళిత నేత మందకృష్ణ మాదిగను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టి చివరికి జైలు పాలు చేశారని, ఉప ముఖ్యమంత్రి రాజయ్యను అకారణంగా తొలగించారని గుర్తు చేశారు. దళితులను సీఎం చేస్తానని, మాట నెరవేర్చకుంటే తల నరుక్కుంటానని చెప్పి మోసం చేశారని, ఒక్కో దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తానని చెప్పి అన్యాయం చేశారని విమర్శించారు. ఓ సమావేశంలో నాటి దళిత మంత్రి కొప్పుల ఈశ్వర్ ను తన పక్కన కూర్చుంటే చేయి పట్టి అసహ్యించుకుంటూ కేసీఆర్ దూరంగా నెట్టివేసిన సంఘటన అప్పట్లో బడుగు, బలహీన వర్గాలను ఎంతో బాధించిందన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రిటైర్మెంట్ అయిన తర్వాత వారిని ఏదో ఒక పదవిలో నియమించి గౌరవించేవారని, కానీ దళితుడు అయినందునే సతీష్ చంద్ర అనే ఐఏఎస్ అధికారి రిటైర్ అయితే ఏ పదవిలోనూ నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్, సంతోష్ రావులు నేరెళ్లలో ఇసుక మాఫియాతో కుమ్మక్కై ప్రజాధనాన్ని దిగమింగుతుంటే అడ్డుకున్న దళితులను థర్డ్ డిగ్రీతో హింసించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని అన్నారు.

స్పీకర్ పట్ల తాతా మధు, నవీన్ రెడ్డిలు అనుచితంగా ప్రవర్తించిన సంఘటన అసెంబ్లీ చరిత్రలో బ్లాక్ డే గా నిలిచిపోతుందని విజయ రమణారావు పేర్కొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన

**అగ్నిధార న్యూస్,( రామగుండం), :**



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో భారీ నిరసన చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కాంగ్రెస్ ఎస్సీ విభాగం రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ తాళ్లపెల్లి యుగేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ.. స్పీకర్ పదవి పార్టీలకు అతీతమైన రాజ్యాంగబద్ధమైన పదవని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. దళిత నాయకుడైన స్పీకర్‌ను అవమానించడం దళిత సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరై స్పీకర్‌కు జరిగిన అవమానంపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల విషయంలో బీఆర్ఎస్ గత పాలనపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని విమర్శించారు. రాజకీయ విమర్శలు విధానాలకే పరిమితం కావాలని, వ్యక్తిగత లేదా సామాజిక కించపరిచే వ్యాఖ్యలు చేయరాదని హితవు పలికారు. తాతా మధు వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధిష్ఠానం ఖండించి, ఆయనతో బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో మేయర్ , డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దడవాయిల సమస్యల పరిష్కారానికి కృషి

**కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలి: డా. జనక్ ప్రసాద్**

**అగ్నిధార న్యూస్,(హైదరాబాద్):**



వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న దడవాయిల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ దడవాయిల రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారత జాతీయ కార్మిక కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు డా. జి. సంజీవరెడ్డితో కలిసి దడవాయిల సంక్షేమం, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతపై చర్చించారు. మార్కెట్ కమిటీలు, రైతులు, వ్యాపారుల మధ్య దడవాయిలు కీలకంగా వ్యవహరిస్తున్నారని జనక్ ప్రసాద్ తెలిపారు. రైతులకు సరైన తూకం, గిట్టుబాటు ధర అందేలా చూడటంతో పాటు మార్కెట్ కమిటీల ఆదాయానికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. అయితే వారికి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రతతో పాటు ఉద్యోగుల భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా, ప్రమాద బీమా వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. దడవాయిలను నైపుణ్య కార్మికులుగా గుర్తించి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అమలు చేయాలని, మార్కెట్ కమిటీ కార్మికులుగా గుర్తించాలని సూచించారు. ఉద్యోగుల భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా, బీమా సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రత్యేక సంక్షేమ పథకం అమలు చేయాలని కోరారు. విధి నిర్వహణలో దడవాయి మృతి చెందితే కుటుంబానికి కనీసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మార్కెట్ కమిటీల ఆదాయం పెంచేందుకు ప్రతి కొనుగోలును తప్పనిసరిగా నమోదు చేసి, ప్రైవేటు మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో జరిగే లావాదేవీల వివరాలను పక్కాగా నమోదు చేయాలని జనక్ ప్రసాద్ సూచించారు. చట్టప్రకారం మార్కెట్ సుంకం వసూలు చేయాలని తెలిపారు. సిబ్బంది కొరతతో కొనుగోళ్ల నమోదు సక్రమంగా జరగడం లేదని మార్కెట్ కమిటీలు తన దృష్టికి తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా సీజన్‌లో అర్ధరాత్రి వరకు పనిచేస్తున్న దడవాయిల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. దుమ్ము, ధూళిలో పనిచేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారి కుటుంబాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సదస్సులో యూనియన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవి, అంతర్జాతీయ కార్మిక సంస్థ పాలక మండలి సభ్యుడు సత్యజిత్‌రెడ్డి, భారత జాతీయ కార్మిక కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగన్నగౌడ్, రాజీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వికాస్‌కుమార్ యాదవ్, నల్ల సంజీవరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## హామీలు తుంగలో తొక్కిన కాంగ్రెస్..

## ప్రజలను మోసం చేసింది

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నేతలు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



వెల్దండ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ,ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వెల్దండ మండల కేంద్రంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఫుడ్ కమిషన్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాసరెడ్డి,నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి డాక్టర్ విజితారెడ్డి, ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను తుంగలో తొక్కి, ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. హామీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజల హక్కులు, సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో,మాజీ మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం,మండల అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ మండల అధ్యక్షులు విజయ్ గౌడ్,కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు,మాజీ వైస్ ఎంపీపీ ఐజాక్ సీనియర్ నాయకులు జంగిలి నిరంజన్ సింగిల్ విండో డైరెక్టర్ నాగుల నాయక్, సర్పంచులు శ్రీనివాసులు మాజీ సర్పంచులు నరసింహ,ఉప సర్పంచ్ తాజా మాజీ మెంబర్స్ బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కరాటే పోటీల్లో గోదావరిఖని విద్యార్థుల సత్తా

## పలు విభాగాల్లో పతకాల పంట

**అగ్నిధార న్యూస్,(రామగుండం) :**

కర్నూలులోని పుష్పరాజ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 13వ జీకేఎంఎస్ నేషనల్ లెవల్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో గోదావరిఖనికి చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 3,155 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో కాటా, కుమితే విభాగాల్లో గోదావరిఖని విద్యార్థులు పలు పతకాలు సాధించారు.బ్లాక్‌బెల్ట్ కాటా విభాగంలో టీ. జయసాయి చరణ్, సహస్ర స్వర్ణ పతకాలు సాధించగా.. స్పందన, వశికర్, సాయిరోషన్, ప్రణీత్, అశ్విత్‌రెడ్డి రజత, కాంస్య పతకాలు సాధించారు. ఆల్ కలర్ బెల్ట్ కాటా విభాగంలో ఆయన్ష్, భార్గవరామ్, ఆదిత్రి స్వర్ణం, శ్రీ, నందన్, బి. సాత్విక్, హ్రీధ్యారెడ్డి, శర్వాణి రజత పతకాలు సాధించారు.బ్లాక్‌బెల్ట్ కుమితే విభాగంలో టీ. జయసాయి చరణ్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, వశికర్ స్వర్ణ పతకాలు సాధించగా.. ఆల్ కలర్ బెల్ట్ కుమితేలో ఆయన్ష్, భార్గవరామ్, శైలేందర్ స్వర్ణం, బి. సాత్విక్, ఆదిత్రి రజత పతకాలు సాధించారు. ఇతర విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. విజేతలను కోచ్ పసునూటి చందుతో పాటు పోస్కాయ్ ఇండియా చీఫ్ రచ్చ శ్రీనుబాబు, జిల్లా కరాటే మాస్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.



## రైతాంగాన్ని దెబ్బతీసే విధానాలపై సమరభేరి



**రైతులు ఐక్యంగా ఉద్యమించాలి: ముడిమడుగుల మల్లన్న**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**

సామ్రాజ్యవాద, కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ వ్యవసాయ రంగం, రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా నాగారం గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు.విదేశీ శక్తులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలు రూపొందించడం వల్ల రైతుల భూములు, వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆరోపించారు. రైతుల భూములను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో రైతుల వారసులు కూలీలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.రైతులు కుల, మత, రాజకీయ భేదాలను పక్కనపెట్టి తమ భూములు, హక్కులు, భవిష్యత్తు పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విదేశీ ఒప్పందాలు, కార్పొరేట్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా రైతాంగం సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నెల 18న పెద్దపల్లిలో నిర్వహించనున్న రైతాంగ సదస్సుకు ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, మేధావులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని మల్లన్న కోరారు.

## ఆటో సంక్షేమ బోర్డు బిల్లు ప్రవేశపెట్టాలి



**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**

చర్చల పేరుతో కాలయాపన చేయకుండా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆటో సంక్షేమ బోర్డు బిల్లు ప్రవేశపెట్టాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. ఎలిగేడు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల ఆటో జేఏసీ అధ్యక్షుడిగా ఎం. లక్ష్మణ్‌ను నియమించారు.

## చందనాపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



**కరీంనగర్‌కు శస్త్రచికిత్సల కోసం తరలింపు**

**అగ్ని ధార న్యూస్,( రామగిరి) :**

గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన వృద్ధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరణ్య కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు, వైద్య సలహాలు అందించారు.కంటి శుక్లాలు, ఇతర శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక బస్సులో కరీంనగర్‌లోని లయన్స్ క్లబ్ ఆసుపత్రికి తరలించారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శిబిరం నిర్వహించడమే కాకుండా, శస్త్రచికిత్సల కోసం రవాణా సౌకర్యం కల్పించిన సర్పంచ్ కొండ మంజుల--శ్రీనివాస్ దంపతులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంటా వెంకటరమణారెడ్డి, బుద్ధార్థి బుచ్చయ్య, మేకల మారుతి, రామగిరి మండల కన్వీనర్ పెరాల మహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఎలవాక ఓదెలు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత..



**సహాయం అందజేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల పరిధిలోని రాచుర్ గ్రామానికి చెందిన తెలగమళ్ళ అనిత రవికుమార్ నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్బంగా కుటుంబ సభ్యులు గోలి శ్రీనివాసరెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామ్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ గౌడ్,మాజీ వైస్ ఎంపిపి లు గోవర్ధన్,అనిల్ కుమార్,మాజీ ఎంపిటిసి గుత్తి వెంకటయ్య,మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,నాయకులు నిరంజన్, లింగం,ప్రభాకర్,రాజు, రాజేష్, వెంకటయ్య,అంజి మాస్టార్,ప్రవీణ్, గణేష్,నరేష్, రమేష్,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై బీఆర్ఎస్ నిరసన..

**తర్నికల్ తండాలో 'బాకీ కార్డుల' పంపిణీ చేసిన డాక్టర్ ఉప్పల అఖిల్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కల్వకుర్తి మండలంలోని తర్నికల్ తండా గ్రామంలో నిర్వహించిన 'బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమంలో డాక్టర్ ఉప్పల అఖిల్ పాల్గొన్నారు. రాష్ట్ర బీఆర్ఎస్ నాయకత్వం పిలుపు మేరకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల సమయంలో ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. అలాగే ఇళ్లకు డోర్ స్టిక్కర్లు ఏర్పాటు చేస్తూ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డీజే, బ్యాండ్, తప్పెట్లతో ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు, గ్రామ ప్రజలు పాల్గొనడంతో తర్నికల్ తండాలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా డాక్టర్ ఉప్పల అఖిల్ మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, టిఆర్ఎస్వి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు దారమోని గణేష్, స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్ హేమంత్ కేశవ పాటల్ ఫోకస్..

**నిర్మాణ పనుల పరిశీలన..**
**ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు అభినందన**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఇళ్లను సుందరంగా నిర్మించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సూచించారు.కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామంలో పర్యటించిన కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించిన కలెక్టర్.. ఆయా ఇళ్ల నిర్మాణ పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయి, ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయం తదితర అంశాలపై వివరాలు సేకరించారు. నిర్మాణంలో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అధికారులు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

**ఆకర్షణీయంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి అభినందన**

ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇందిరమ్మ ఇళ్లను ఆకర్షణీయంగా, సుందరంగా నిర్మించుకుని చక్కగా తీర్చిదిద్దుకున్న పలువురు లబ్ధిదారులను కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రంలో సౌకర్యాలపై ఆరాఅనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, కేంద్రం నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు చిన్నారులకు పౌష్టికాహారం, ఇతర సేవలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు.ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల పరిశీలనగ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల హాజరు, విద్యాబోధన, పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై మండల విద్యాధికారి శంకర్ నాయక్ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా, చక్కగా నిర్వహిస్తున్న తీరుపై కలెక్టర్



సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపిడిఓ గీత ,మండల విద్యాధికారి శంకర్ నాయక్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా భూముల రీ సర్వే చేపట్టాలి

**బెక్కెరలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

భూ భారతి కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించిన కలెక్టర్ అధికారులు, సర్వేయర్లను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలోని రెవెన్యూ, ప్రభుత్వ భూములకు సంబంధించిన రీ సర్వే వివరాలపై అధికారులతో చర్చించారు. రైతులకు ముందస్తుగా సర్వే సమాచారం అందించారా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. రైతులకు పూర్తి సమాచారం అందిస్తూ, వారి సమక్షంలోనే భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే అత్యంత కీలకమైన ప్రక్రియ అని, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని అన్నారు. భూ వివరాల డేటా నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు, సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతుల భూ వివరాల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిర్ణీత నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతుల భూ హక్కులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీ సర్వేలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులకు



సూచించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఏడి సర్వేయర్ గిరిధర్, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, ఆర్ఐ కార్తీక్ రెడ్డి, సర్వేయర్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కులాల మధ్య చిచ్చు పెడితే సహించేది లేదు

**రెడ్డి సామాజిక వర్గాన్ని టార్గెట్ చేయడం సరికాదు**
**ఎమ్మెల్సీగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**
**ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే ప్రతిఘటన తప్పదు**

**అగ్ని ధార న్యూస్ పాన్గల్ వనపర్తి జిల్లా:**

రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని  తో కొల్లాపూర్ తాలూకా ఉపాధ్యక్షులు అచ్యుతరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీగా ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారు ఉన్నారని, ఒక పార్టీ రాజకీయ అవసరాల కోసం మాట్లాడుతున్నారనే కారణంతో మొత్తం సామాజిక వర్గాన్ని టార్గెట్ చేయడం సరికాదన్నారు. రాజకీయాలతో సంబంధం లేని సాధారణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం చదువుకున్న వ్యక్తికి తగదని అన్నారు. కులాల మధ్య విభేదాలు సృష్టించే వ్యాఖ్యలకు స్వస్తి పలకాలని, ప్రజా జీవితంలో ఉన్నవారు సంయమనం పాటించాలని అచ్యుతరెడ్డి సూచించారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.



## జేపీసీ దళిత మహిళా అధ్యక్షురాలుగా చంద్రకళ

**పెద్దపల్లి, సెప్టెంబర్ 09 అగ్నిధారన్యూస్ (కమాన్ ప్రెస్ క్లబ్ న్యూస్):**

తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ,పేద, బడుగు,బలహీన వర్గాల హక్కుల సాధనలోనూ నిరంతరం ముందుండి పోరాడిన ప్రముఖ ఉద్యమ కళాకారిణి, దళిత రత్న.అవార్డు గ్రహీత పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన దెబ్బేట చంద్రకళ ను దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర దళిత మహిళా అధ్యక్షురాలుగా నియమిస్తూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రమౌళి మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బత్తుల చంద్రమౌళి మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం,దళిత,బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం చంద్రకళ సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్,జాంబవ,అరుంధతి వంటి మహనీయుల ఆలోచనా విధానాన్ని,ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, క్షేత్రస్థాయిలో దళిత మహిళల హక్కుల పరిరక్షణకు,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జేఏసీ రాష్ట్ర నాయకత్వానికి,నిరంతరం తనకు సహకరిస్తున్న సహచరులకు, మద్దతుదారులకు చంద్రకళ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బడుగు,బలహీన వర్గాల హక్కుల సాధన కోసం, మహిళల సమస్యల పరిష్కారం కోసం తన చివరి శ్వాస వరకు పోరాడుతానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.దెబ్బేట చంద్రకళ నియామకం పట్ల పలువురు దళిత,బహుజన సంఘాల నాయకులు, ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ చంద్రకళ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## హామీలు ఎక్కడ.. అమలు ఎప్పుడు?

**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి**
**తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్**

**అగ్నిధార న్యూస్ ,(కరీంనగర్) :**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ.2,500, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం, రైతులకు రూ.500 బోనస్, నిరుద్యోగులకు భృతి, యువతకు ఉద్యోగాలు వంటి హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, సంక్షేమ బోర్డు ఏర్పాటుపైనా కార్యాచరణ ప్రకటించాలన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, బీసీ సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్ల కేటాయింపు, ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ వంటి హామీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల సాయం, మైనారిటీలకు హామీ ఇచ్చిన నిధులు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం వంటి హామీలను అమలు చేయాలని కోరారు.జర్నలిస్టులు, ప్రాక్టీసింగ్ న్యాయవాదులకు ఇంటి స్థలాలు, గల్ఫ్ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రానికి హామీల ప్రభుత్వం కాకుండా హామీలను అమలు చేసే నాయకత్వం అవసరమని హరిప్రసాద్ అన్నారు.కార్యక్రమంలో పార్లమెంటు ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, ఆదివాసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొల్లంపల్లిలో తాగునీటి ట్యాంకుల శుభ్రతకు ప్రత్యేక చర్యలు

**జర్మన్ సాంకేతికతతో కూడిన యంత్రాలతో నీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత..**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ, మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను ప్రత్యేక యంత్రాల సహాయంతో శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరిచారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను తొలగించి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల ద్వారా గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విధానంలో ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికిని తొలగించడంతో పాటు నీటి నిల్వ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బొల్లంపల్లి గ్రామ సర్పంచ్ ప్రసాద్ గౌడ్, డిప్యూటీ సర్పంచ్ రామకృష్ణ, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్రావు, రామ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు శిరీష, శ్రీనివాస్ చారి, గ్రామ నాయకులు, యువకులు, పెద్దమనుషులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ధ్యాప నిఖిల్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండలంలోని ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన కానుగుల అంజయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా 5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పపహాడ్ గ్రామ ఇందిరమ్మ కమిటి సభ్యులు సల్వాది నాగరాజు వార్డు మెంబర్ పాల లలితా యాదయ్య మాజీ వార్డు సభ్యులు గోరటి చంద్రశేఖర్ యువజన కాంగ్రెస్ నాయకులు జెట్టి హరికృష్ణ , గ్రామస్తులు మాదారం శ్రీశైలం కొమ్మగోని శ్రీశైలం నూనె శేఖర్ నూనె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## చీపునుంతలలో ఘనంగా పోచమ్మ బోనాలు.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామ ప్రజలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని చీపునుంతల గ్రామంలో పోచమ్మ బోనాల వేడుకలను సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆధ్వర్యంలో, గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, నాయకులు వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. బోనాలకు హాజరైన గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు వేడుకలు ప్రశాంతంగా జరిగేలా నాయకులు, గ్రామ పాలకవర్గ సభ్యులు సమన్వయంతో వ్యవహరించారు.పోచమ్మ తల్లి బోనాల వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ ప్రజలకు సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మతో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జులా మహేష్,భక్తులు పాల్గొన్నారు.

# సంక్షోభంలోకి రాష్ట్రాన్ని నెట్టిన రేవంత్ ప్రభుత్వం

**పతనం తప్పదు.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం-నిరంజన్‌రెడ్డి**

**అగ్నిధార వనపర్తి న్యూస్ వనపర్తి జిల్లా:**

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సంక్షోభంలోకి నెట్టిందని, ఈ ప్రభుత్వ పతనం తప్పదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఇంతియాజ్ ఇసాక్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు ఇచ్చి వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిందని, వెయ్యి రోజులు దాటినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ చేపట్టిన ఎనిమిది రోజుల నిరసన కార్యక్రమాలకు లక్షలాది మంది ప్రజలు స్పందించి ప్రభుత్వంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారని తెలిపారు. కీలక శాఖల పాలన విఫలమైందని, విద్యాశాఖలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆరోపించారు. గురుకులాల్లో విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, ఆకునూరి మురళి కమిషన్ నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హోం, మున్సిపల్, విద్యాశాఖల్లో అవినీతి పెరిగిందని ఆరోపించారు.

**రైతుల సమస్యలను పట్టించుకోలేదు**

రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని అన్నారు. యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చిందని, రైతుబంధు, రైతుబీమా పథకాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. సాగునీటి వాటాలను కాపాడుకోవడంలో విఫలమయ్యారని, కేఎల్‌ఐలో మూడు పంపులకు ఒక్కటి మాత్రమే పనిచేస్తోందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.




బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని 7 వేల మెగావాట్ల నుంచి 25 వేల మెగావాట్లకు పెంచిందని, ప్రస్తుతం రైతులు కరెంట్ కోసం సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు చేసే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. కరెంట్, సాగునీటి వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. కేసీఆర్‌ను విమర్శించడమే రేవంత్‌రెడ్డి ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారని, రేవంత్ ప్రభుత్వం పతనమైన తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని నిరంజన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో ఇంతియాజ్ ఇసాక్, గట్టు యాదవ్, బి. లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే బిఆర్ఎస్ దాడులు

**కెసిఆర్ ఆదేశాలతోనే స్పీకర్ ను దూషించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**
**గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి**
**తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలి**
**గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**



గజ్వేల్ ప్రజా ప్రతినిధులు, సమాజానికి రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే బిఆర్ఎస్ దాడులు చేస్తుండగా, నిన్న అసెంబ్లీ వద్ద జరిగిన సంఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఎర్రవల్లి శివారులో జరిగిన తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ ఆదేశాలతోనే అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ ఎమ్మెల్సీ సభ్యత్వం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దళితులు, మహిళల పట్ల బిఆర్ఎస్ నేతల వైఖరి సిగ్గుచేటు కాగా, మహిళా పోలీసుల ముందే చొక్కాలు విప్పడం వారి నైజం, సంస్కృతిని బహిర్గతం చేస్తుందని ఎద్దేవా చేశారు. చేసిన తప్పు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతుండగా, స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలతో దళిత సమాజం ఆగ్రహిస్తున్న విషయాన్ని గమనించాలని సూచించారు. ప్రాయశ్చిత్తం కోసం కాంగ్రెస్ పార్టీ కెసిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఫాం హౌజ్ వద్ద డప్పు మోతలతో నిరసన తెలిపినట్లు చెప్పారు. ఇప్పటికైనా కేసీఆర్ బయటకు వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించడం తోపాటు అసెంబ్లీకి హాజరుకావాలని వివరించారు.

## నేడే ఆదివారహా స్వామి దేవస్థానం హుండీ లెక్కింపులి

**ఆలయ కమిటీ చైర్మన్ ముస్యాల దామోదర్**

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**



కమాన్ పూర్ : పెద్దపల్లి జిల్లా,కమాన్‌పూర్ మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఆదివార స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ ఆదాయాన్ని ఈ నెల 9వ తేదీన (బుధవారం) ఉదయం 10:00 గంటలకు స్వామివారి కళ్యాణమంటపంలో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముస్యాల దామోదర్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈవో) కొసన కాంతరెడ్డి లు తెలిపారు. ఇటీవల అత్యంత వైభవంగా జరిగిన శ్రీ ఆదివార స్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలతో పాటు రోజూవారీగా దర్శనానికి వచ్చే భక్తులు తమ మొక్కుబడులలో భాగంగా హుండీలో వేసిన కానుకలు, ఆదాయాన్ని అధికారికంగా లెక్కించేందుకు ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా సాగేందుకు గాను వివిధ శాఖల అధికారులకు ముందస్తు సమాచారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## అరెస్టులతోనీ ప్రశ్నించే గోతులను ఆపలేరు

**బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వెల్ జగదేవపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.కేసీఆర్ ఫార్మ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళ్లకుండా సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ద నాగరాజు,మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను ఆపలేరని, భారత రాజ్యాంగం కలిపించిన హక్కు లను నేడు కాంగ్రెస్ పార్టీ కలరాస్తుందని అన్నారు.నాయకులు వంశీ, హలీం, మనోజ్ లను స్టేషన్‌కు తరలించారు. అలాగే బీఆర్ఎస్ నేతలను ఉదయం జగదేవపూర్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతో కృషి



**విశ్వహిందూ సేన ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం, దౌలాపూర్ గ్రామంలోని మహిళా సంఖ్య భవనంలో మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజే నర్సమ్మ ఆధ్వర్యంలో పంపిణి చేశారు.ముఖ్య అతిథులుగా గ్యాధారి రాజారామ్ విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర గో రక్ష కో-కన్వీనర్ తుమ్మల బాలు మెదక్ విభాగం కార్యదర్శి

**రాగిరు రాధ విశ్వహిందూ సేన సభ్యురాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ**

మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు. విశ్వహిందూ సేన ట్రస్ట్ ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేయడం భారతదేశంలో మహిళా అభ్యున్నతికి, వారి ఆర్థిక స్వావలంబనకు ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్ర మం లో మంజే లింగం తలారి ఐల్లయ్య మంత్రి కృష్ణమూర్తి మంత్రి జయరాంలు మహిళాలు తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, జుబేర్ పాషా ముందస్తు హౌస్ అరెస్ట్

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

ములుగు మండలం కెసిఆర్ పాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు పిలుపు నిచ్చారని డీసీసీబీ డైరెక్టర్ అంజి రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు జుబేర్ పాషా లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ భరత్ దేశం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు రాజకీయ పార్టీలు ప్రధాన పక్షమైన బి ఆర్ ఎస్ పార్టీ ప్రశ్నిస్తుంటే ప్రశ్నించే హక్కు ఉన్నదని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రతి పక్షల గొంతు నొక్కలని చుస్తే కల గర్భంలో కలిసి పోవడం తప్పదని అధికార గర్వంతో ప్రతి పక్ష నాయకుల గొంతు నొక్కితే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ప్రజా పాలన అని చెప్పుకునే రేవంత్ రెడ్డి దొంగ హామీలు ఆరు గ్యారంటీ లు 420డిక్లరేషన్ లు అమలు చేయకుండా దొంగ హామీలతో గద్దె నెక్కిన రేవంత్ రెడ్డి ఇక నుంచి ప్రతి బి ఆర్ ఎస్ కార్యకర్త సైనికులగా మరి నీ కాంగ్రెస్ పార్టీ భారతం పడతారని తెలంగాణ లో ప్రజలు గమనిస్తున్నారని నీ ప్రభుత్వం భూ గర్భంలో కలవడం ఖాయమని హెచ్చరించారు.

## వంటేరు ప్రతాప్ రెడ్డి అక్రమ అరెస్ట్



**సింగయపల్లి చౌరస్తా వద్ద భారీ ధర్నా**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ వంటేరు ప్రతాప్ రెడ్డి అక్రమ అరెస్టు చేసి బేగం పేట్ కు తరలించడం సిగ్గు చెట్టు. బి ఆర్ ఎస్ శాసనసభ్యులను మహిళా ఎమ్మెల్యేలను కూడా చూడకుండా రేవంత్ రెడ్డి దుర్మార్గం ప్రభుత్వం డాడీ చేయడం నిరసిస్తూ హైదరాబాద్ కరీంనగర్ హైవే సింగయపల్లి చౌరస్తా వద్ద బి ఆర్ ఎస్ పార్టీ గజ్వెల్ ఇంచార్జి బి ఆర్ ఎస్ శ్రేణులతో కలిసి ప్రతాప్ రెడ్డి భారీ ధర్నా నిర్వహించడం జరిగింది.

## ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శనిగరపు చంద్రశేఖర్

**అగ్నిధార న్యూస్ (రామగుండం):**



ఏఐటీయూసీ నాలుగో రాష్ట్ర మహాసభల్లో గోదావరిఖనికి చెందిన శనిగరపు చంద్రశేఖర్ రెండోసారి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు నిర్వహించిన మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి ఏఐటీయూసీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎన్నికైన అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసి, గతంలో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కొనసాగించే వరకు ఉద్యమాలు చేపడతామని అన్నారు. కార్మిక చట్టాలు, హక్కులు, ఉద్యోగ భద్రత, ఉపాధి హామీ కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. చంద్రశేఖర్‌ను ఏఐటీయూసీ నగర సమితి నాయకులు అబ్దుల్ కరీం, రెడపాక లక్ష్మణ్, నాంసాని శంకర్, కలికోట సతీష్‌కుమార్, షేక్ మసూద్ తదితరులు అభినందించారు.

## ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమం

**ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి**
**మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్**

**అగ్నిధార న్యూస్ మంథని :**

మంథని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై పట్టణంలోని వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో,మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ఎల్లంకి వంశీధర్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.




## టిఆర్‌పిలో చేరిన టిఇపిఎ వ్యవస్థాపకులు ధార మధు




**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్) :**

తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఎ) వ్యవస్థాపకులు ధార మధు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్‌పీ)లో చేరారు. సోమవారం హైదరాబాద్‌లో పార్టీ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని ఆయన పార్టీలో చేరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ సమస్యలపై ధార మధు చేస్తున్న కృషి పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఆయన చేరికతో విద్యారంగంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మెరుగు చందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగీతం జెడ్ పి హెచ్ ఎస్ కు వాటర్ ప్యూరిఫైయర్ అందించిన రిటైర్డ్ టీచర్ ఆర్. కిష్టయ్య

**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"**



సంగారెడ్డి జిల్లా రైకోడ్ మండల్ సింగీతం విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందాలనే సేవా సంకల్పంతో రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆర్ కిష్టయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగీతంకు ఆధునిక మంచినీటి వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. ఈ సేవా కార్యక్రమం పాఠశాలలో ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సింలు మాజీ ఎంపీటీసీ నిరంజన్ మాజీ సర్పంచ్ అంబన్న ప్రధానోపాధ్యాయులు శివకుమార్ , ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం , ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, పాండు తదితరులు పాల్గొని కిష్టయ్య ను శాలువాతో సన్మానించి అభినందించారు.

# ఏఎన్ఎంలకు ట్యాబ్‌ల పంపిణీ

**ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాల నమోదును సమర్ధవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**డిజిటల్ సాంకేతికతను సద్వినియోగం చేసుకొని డేటా నమోదులో వేగం, ఖచ్చితత్వం పెంచాలి**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి సెప్టెంబర్ 08:**



జిల్లాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (యూపీహెచ్‌సీ)లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాల నమోదును మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లాలోని యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు మంగళవారం సమగ్రత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ ఆన్‌లైన్ కార్యక్రమాలు, సేవల వివరాలు, గర్భిణీల నమోదు, టీకాల వివరాలు, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య కార్యక్రమాల పురోగతి తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలును వేగవంతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు డిజిటల్ సాంకేతికతను సమర్ధవంతంగా వినియోగం చుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు సేకరించే ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డేటా నమోదులో వేగంతో పాటు ఖచ్చితత్వానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణీల నమోదు, టీకాల కార్యక్రమాలు, కుటుంబ సంక్షేమం, ప్రజారోగ్య కార్యక్రమాలు తదితర సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదయ్యే డేటా ఆధారంగా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించే అవకాశం ఉన్నందున ప్రతి వివరాన్ని బాధ్యతగా నమోదు చేయాలని తెలిపారు. ఏఎన్ఎంలకు అందించిన ట్యాబ్‌లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని క్షేత్రస్థాయి ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు, ఆరోగ్య కార్యక్రమాల అమలు, పర్యవేక్షణలో మరింత పారదర్శకత, ఖచ్చితత్వం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వై. పవిత్ర, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, యూపీహెచ్‌సీల వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, తదితరులు, పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలి.**

**సేంద్రియ, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి.**

**వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష సమావేశం.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి సెప్టెంబర్ 08:**





డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఎలాంటి తప్పులు, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. పంటల సాగు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులకు లాభదాయకమైన పంటలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతులతో నిరంతరం అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవల అమలును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రాజీనామా చుట్టూ రాజకీయాలు



**మెదక్ :** తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజీనామా డిమాండ్ చుట్టూ భగ్గుమంటున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతున్న కేసీఆర్.. ఎమ్మెల్యే పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని అధికార కాంగ్రెస్ ముప్పేట దాడి చేస్తుంటే, బీఆర్ఎస్ అంతే దీటుగా ప్రతిదాడికి దిగుతోంది. ఒకవైపు శాసనసభ సంప్రదాయాలు, నైతిక బాధ్యతల పేరిట కాంగ్రెస్ ఒత్తిడి పెంచుతుంటే, మరోవైపు దీనిని రాజకీయ ప్రతీకారంగా అభివర్ణిస్తూ బీఆర్ఎస్ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. మొత్తంగా కేసీఆర్ హాజరు అంశం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రణరంగాన్ని సృష్టించింది. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి సభకు రాకుండా తప్పించుకోవడం ప్రజాస్వామ్యానికే అవమానమని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. ప్రజల సమస్యలను చట్టసభలో లేవనెత్తాల్సిన బాధ్యతను విస్మరిస్తూ, ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని అధికార పక్షం తేల్చి చెబుతోంది. అసెంబ్లీ గేటు తొక్కకుండా ప్రజాధనంతో వచ్చే జీతభత్యాలు, సదుపాయాలు అనుభవించడం సిగ్గుచేటని మంత్రులు నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు. పదేళ్లపాటు సీఎంగా పనిచేసిన వ్యక్తికి అసెంబ్లీలో కూర్చోవడానికి అహం అడ్డొస్తోందా అని కాంగ్రెస్ నిలదీస్తోంది. ప్రతిపక్ష నేత హోదా దక్కించుకుని కూడా సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకపోతే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం వెనుక ఉన్న కారణాలను రాజకీయంగా, భావోద్వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. సీఎం స్థాయి వ్యక్తి కేసీఆర్ చావును కోరుకుంటున్నారని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి మాట్లాడే వ్యక్తులు ఉన్న సభలోకి వెళ్లి మాటలు పడాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదని గులాబీ నేతలు స్పష్టం చేస్తున్నారు. సభలో చర్చల కంటే వ్యక్తిగత దూషణలు, కక్షసాధింపులే లక్ష్యంగా మారినప్పుడు అక్కడకు వెళ్లడం ఆత్మగౌరవానికి భంగకరమని వాదిస్తున్నారు. కేసీఆర్ మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతారని బీఆర్ఎస్ నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. గతంలో తమిళనాడు రాజకీయాల్లో ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత వంటి దిగ్గజాలు, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా అధికార పక్షం వైఖరిని నిరసిస్తూ సభను బహిష్కరించిన సందర్భాలను బీఆర్ఎస్ గుర్తుచేస్తోంది. అప్పుడు ప్రజాక్షేత్రంలో తేల్చుకుని తిరిగి అధికారంలోకి వచ్చినట్లే, కేసీఆర్ కూడా ప్రజల వద్దకే వెళ్తారని స్పష్టం చేస్తోంది. ఈ వివాదం వెనుక ఉభయపక్షాల వ్యూహాత్మక రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్‌ను సభకు రప్పించడం ద్వారా ఆయన వైఫల్యాలను, గత పదేళ్ల పాలనను నేరుగా ఎండగట్టవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఒకవేళ ఆయన రాకపోతే పారిపోయారన్న ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్‌ను నైతికంగా బలహీనపరచాలని అధికార పార్టీ చూస్తోంది. గజ్వేల్‌లో ఉపఎన్నిక వస్తే కేసీఆర్‌ను రాజకీయంగా మరింత దెబ్బతీయవచ్చనే ఆలోచన కూడా కాంగ్రెస్ వ్యూహాల్లో భాగంగా కనిపిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, కేసీఆర్ భద్రత, కాంగ్రెస్ నేతల అనుచిత వ్యాఖ్యలను ప్రజల్లో ప్రధాన చర్చనీయాంశంగా మార్చాలని యోచిస్తోంది.

## జిల్లెల్లలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అర్హులైన లబ్ధిదారులకు కార్డులు అందజేసిన ఎస్సీ ఎస్టీ సభ్యులు జిల్లెల్ల రాములు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలం లోని జిల్లెల్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జిల్లెల్ల గ్రామపంచాయతీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు జిల్లెల్ల రాములు, గ్రామ సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరి రవిగౌడ్, ఉపసర్పంచ్ ఎముక రవి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి గౌడ్, గ్రామ వార్డు సభ్యులు, రేషన్ డీలర్ గుమ్మకొండ రాములు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ యువకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

## బోనాల పండుగ పోస్టర్ ఆవిష్కరణ చేసిన సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో గురువారం, శుక్రవారం నిర్వహించనున్న బోనాల పండుగకు సంబంధించిన పోస్టర్లను గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, యువకులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోటిన్నర రూపాయల విలువైన 12 కిలోల హాషిష్ ఆయిల్ స్వాధీనం

**ముగ్గురు పెడ్లర్లు అరెస్టు**

**హైదరాబాద్** నాలుగో సారి హాషిష్ ఆయిల్ ట్రాన్స్ పోర్ట్ ని బట్టబయలు చేసామని మల్కాజ్ గిరి పోలీసు కమిషనర్ సుమతి అన్నారు. డ్రై గంజాను ట్రాన్స్ పోర్టు చేయటం కష్టం అవుతుందని, హాషిష్ ఆయిల్ ట్రాన్స్ పోర్ట్ చేస్తున్నారు. కోటిన్నర రూపాయల విలువైన 12 కిలోల హాషిష్ ఆయిల్ పట్టుకున్నాం. కుషాయిగూడ లో ఈ ముఠాను పట్టుకున్నామని అన్నారు. ముగ్గురు పెడ్లర్లు పట్టుకున్నాం, ఇద్దరు సప్లయర్ లు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న సప్లయర్ విజయ్ కీలకం.. నాలుగు నగరాలకు హాషిష్ ఆయిల్ సరఫరా చేస్తున్నారు . విజయ్ ను పట్టుకుంటే మొత్తం నెట్వర్క్ వెలుగులోకి , ఆర్గనైజ్డ్ గా ట్రాన్స్ఫర్ట్ చేస్తున్నారు. ఒక్క గ్రాము హాషిష్ ఆయిల్ రెండు నుంచి మూడు వేలకు అమ్ముతున్నారు. ఒక్కసారి ఒక్క గ్రాము తీసుకుంటే వారం రోజుల పాటు ఆ మత్తు ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 77 కేసులు నమోదు చేసి, 107 మందిని అరెస్టు చేశాం. ఈ ఏడాది ఐదు కోట్ల రూపాయల విలువైన హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

## ఆర్మీ అయుధాల చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్** ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది . అనుమానితుల ఎలిమినేషన్ ప్రాసెస్ స్టార్ట్ చేశామని మల్కాజ్ గిరి పోలీసు కమిషనర్ సుమతి వెల్లడించారు. ఒక క్రమపద్దతిలో దర్యాప్తు చేస్తున్నాం,. అన్ని ఏజెన్సీలతో కలిసి పని చేస్తున్నాం. త్వరలోనే కేసు మిస్టరీని చేధిస్తాం. కేసు ఇన్విస్టిగేషన్ ఇంకా కొనసాగుతుందని అన్నారు.

## అబద్ధాలు, మోసలతోనే కాంగ్రేస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన

**సికింద్రాబాద్.** అబద్ధాలు, మోసలతోనే కాంగ్రేస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన సాగిందని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నేడు సికింద్రాబాద్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు సామల హేమ, రాసురి సునీత, ఆకుల రూప మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, 420హామీలు, 6గ్యారంటీలు చెప్పి ఒక్క హామీని గానీ, గ్యారెంటీ ని గాని పూర్తి స్థాయిలో అమలు పరచిన పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దానికి తోడు ప్రజా పాలన పేరుతో యూసీడీ మహిళా సంఘాలలోని మహిళలను అధికారులను ప్రభుత్వ పరంగా కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి వాడుకుంటున్నారని తెలిపారు. వారి సభలు సమావేశాలకు తీసుకు వెళ్లడమే కాకుండా రానివారికి ప్రభుత్వ పథకాలు, లోన్స్ రాకుండా చేస్తామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. బీ ఆర్ ఎస్ ప్రజల మధ్య ఉండి ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ మెడలు వంచడం ఖాయమని హెచ్చరించారు.

## కంటోన్మెంట్ సమస్యలపై బిఆర్ఎస్ వినతి పత్రం

**సికింద్రాబాద్..** వెయ్యి రోజులు కాంగ్రెస్ పాలన అభిమానం అయిన నేపథ్యంలో బిఆర్ఎస్ పిలుపుమేరకు కంటోన్మెంట్ బిఆర్ఎస్ నాయకుడు మన్నె కృషాంక్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ సీఈవో అరవింద్ కుమార్ ద్వివేదికి కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కంటోన్మెంట్ ప్రజావాణి కార్యక్రమం లేకపోవడంతో పాటు ఎన్నికలు కూడా జరిగే ఆరు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కృషాంక్ అన్నారు. రహదారులు గుంతలుగా మారడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మౌలిక వసతుల లేమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బి ఆర్ ఎస్ నాయకులపై నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీ గణేష్ పాత్ర ఏముందని ప్రశ్నించారు. కెసిఆర్ కు రాజీనామాలు కొత్త కావని, వెయ్యి రోజుల రేవంత్ రెడ్డి పాలన విఫలం చెందిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని సూచించారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com